
వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగుల బదిలీల ప్రక్రియ నడుస్తున్న నేపథ్యంలో జిల్లాలోని ఏడు నియోజక వర్గాల పరిధిలో ప్రజాప్రతినిధులు భిన్న పోకడలు ప్రదర్శిస్తున్నారు. ప్రభుత్వ పాలనకు సంబంధించి పోలీసు, రెవిన్యూ, గ్రామ పంచాయతీ, విద్యుత్ తదితర శాఖలతో ప్రజలకు రోజువారీ వ్యవహారాలు ముడిపడివున్న నేపథ్యంలో అధికారులు, ఉద్యోగుల బదిలీలపై ప్రజాప్రతినిధులు తలోవిధంగా వ్యవహరిస్తున్నారు. నాలుగు నియోజకవర్గాల్లో అధికార పార్టీ ముఖ్యనేతల కుటుంబాల ప్రమేయం స్పష్టంగా కనిపిస్తుండగా మూడు నియోజకవర్గాల్లో తెరవెనుక కీలక నేత పేరే ప్రముఖంగా వినిపిస్తోంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



బదిలీలు

అధికారులు, ఉద్యోగుల బదిలీల్లో నేతల భిన్న పోకడలు

విద్యుత్‌శాఖలో రిటైర్డు అధికారి సిఫారసే కీలకం

నాలుగు చోట్ల కుటుంబాల జోక్యం... మూడుచోట్ల తెరవెనుక నేత ప్రమేయం

సూళ్ళూరుపేట, సత్యవేడు, శ్రీకాళహస్తి, తిరుపతి నియోజకవర్గాల్లో బదిలీల వ్యవహారాల్లో ముఖ్యనేతల కుటుంబ సభ్యుల ప్రమేయం కనిపిస్తోందన్న ఆరోపణలు వస్తున్నాయి. సూళ్ళూరుపేటలో ముఖ్యనేత స్థానం నామమాత్రం కాగా తండ్రి, సోదరుడు, జీవితభాగస్వామి తదితరుల జోక్యం ఎక్కువైందని పార్టీ వర్గాలే ఆరోపిస్తున్నాయి. పోలీసు, రెవిన్యూ, ఇంజనీరింగ్ శాఖల ఉద్యోగులు వీరిని ఆశ్రయిస్తున్నారు. ఆదాయం వున్న పోస్టులకు పోటీ తీవ్రంగా వుంది. గూడూరు ప్రాంత అధికారులు తడ, సూళ్ళూరుపేట మండలాలకు వచ్చేందుకు గట్టిగా యత్నిస్తున్నారు. సత్యవేడులో ముఖ్యనేత కుమారుడి జోక్యం మునుపటికంటే పెరిగిందని పార్టీ వర్గాలు వాపోతున్నాయి. శ్రీకాళహస్తిలో ముక్కంటి దేవస్థానం అంతర్గత బదిలీలలో ముఖ్యనేత కుటుంబీకులు కల్పించుకున్నారనే ఆరోపణలున్నాయి. ఇక తిరుపతిలో కూడా ముఖ్యనేత సోదరుడి కుమారుడితో పాటు వారికి సన్నిహితంగా వుండే కూటమి పార్టీల నేతలు కొందరి ప్రమేయం కన్పిస్తోందన్న విమర్శలున్నాయి.వెంకటగిరి, గూడూరు, సూళ్ళూరుపేట నియోజకవర్గాల్లో తెర వెనుక ప్రముఖ నేత ఒకరు కీలక పాత్ర పోషిస్తున్నట్టు సమాచారం. ప్రధానంగా పోలీసు శాఖకు సంబంధించిన బదిలీలన్నింటిలో ఈ ప్రముఖ నేత నిర్ణయమే పనిచేసిందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఆ నేత సన్నిహిత బంధువు కూడా బదిలీల్లో జోక్యం చేసుకుని సిఫారసులు చేస్తున్నారని, ఆయా నియోజకవర్గాల ముఖ్యనేతలు సైతం ఆ వ్యక్తి సిఫారసులకే విలువ ఇస్తున్నట్టు సమాచారం.

సత్యవేడులో బదిలీలపై సీఎంవో దృష్టి?

సత్యవేడు నియోజకవర్గంలో దాదాపుగా బదిలీలన్నీ డబ్బు ప్రమేయంతోనే జరుగుతున్నట్టు పార్టీ వర్గాలే నేరుగా సీఎం కార్యాలయానికి ఫిర్యాదులు చేసినట్టు తెలిసింది. దీంతో ఆరా తీసిన సీఎంవో వర్గాలు సత్యవేడులో పరిస్థితి పట్ల తీవ్ర అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తం చేసినట్టు స్థానికంగా ప్రచారం జరుగుతోంది. దీంతో ఆ నియోజకవర్గంలో ముఖ్య అధికారుల బదిలీలకు సంబంధించి వచ్చే సిఫారసులను తమ దృష్టికి తేవాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించినట్టు పార్టీ వర్గాలే చెబుతున్నాయి. గతంలో వైసీపీ నేతలకు అనుకూలంగా పనిచేసిన పలువురు అధికారులు, ఉద్యోగులు అక్కడే కొనసాగడానికి యత్నిస్తున్న నేపథ్యంలో సీఎం వోకు ఫిర్యాదులు వెళ్ళినట్టు తెలిసింది.

చంద్రగిరి నుంచీ అందరూ కదలాల్సిందే!

చంద్రగిరి నియోజకవర్గంలో పనిచేస్తున్న అధికారులు, ఉద్యోగులు అందరూ గత ఐదేళ్ళూ అనివార్యంగా వైసీపీ నేతలతో అంటకాగాల్సి వచ్చింది. అప్పట్లో ఆ పార్టీ నేతలు చెప్పినట్టల్లా వినాల్సివచ్చింది. దీంతో ఇపుడు జరుగుతున్న బదిలీల్లో దాదాపుగా అందరినీ నియోజకవర్గం నుంచీ వెలుపలికి బదిలీ చేయాలని ముఖ్యనేత నిర్ణయించినట్టు సమాచారం. దీంతో ఎవరు సిఫారసు చేసినా లోతుగా ఆరా తీసిన తర్వాతే సిఫారసు లేఖలు ఇస్తున్నట్టు తెలిసింది. అయితే ఆరోపణలున్న వారి విషయంలో మాత్రం ఎవరు చెప్పినా వినకుండా కఠినంగా వ్యవహరిస్తున్నట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. గతంలో కొందరి పనితీరు పట్ల ఆగ్రహంగా వున్న ముఖ్యనేత అలాంటి వారిని నియోజకవర్గంలో కొనసాగించకపోగా చుట్టుపక్కల నియోజకవర్గాల్లో కూడా నియమించవద్దని ఇరుగుపొరుగు ముఖ్యనేతలను కోరుతున్నట్టు సమాచారం.

శ్రీకాళహస్తికి వచ్చేందుకు అధికారుల విముఖత

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో పలు శాఖలకు సంబంధించి బాగా ఆదాయం వచ్చే కీలక స్థానాలున్నప్పటికీ అక్కడికి వచ్చేందుకు అధికారులు విముఖంగా వున్నట్టు సమాచారం. నియోజకవర్గంలో ముఖ్యనేత ఒకరు అధికారుల పట్ల దురుసుగా మాట్లాడుతున్నారన్న ప్రచారం నేపథ్యంలో అధికారులు ఆసక్తి చూపడం లేదని సమాచారం.తాము ఏమి చెబితే అది చేసేందుకు అంగీకరించే అధికారులను నియమించుకునేందుకు ఆయన గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నట్టు తెలిసింది.కాగా ముఖ్యనేతకు సన్నిహితంగా వుండే ఇద్దరు నాయకులు బదిలీల వ్యవహారంలో కీలకంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ముక్కంటి ఆలయ అంతర్గత బదిలీల్లోనూ, ఏర్పేడు మండలంలో పలువురి బదిలీల విషయంలోనూ ముఖ్యనేత కుటుంబీకుల జోక్యం వున్నట్టు పార్టీ వర్గాలే చెబుతున్నాయి.

తిరుపతిలో గందరగోళం

తిరుపతి నియోజకవర్గంలో ముఖ్యనేత సోదరుడి కుమారుడి జోక్యం బదిలీల వ్యవహారంలో ప్రస్ఫుటంగా కనిపిస్తోందన్న ఆరోపణలున్నాయి. ఇక్కడ కూటమి పార్టీల నాయకులు పలువురు చురుగ్గా వుండడంతో ఎవరి స్థాయిలో వారు బదిలీలకు సిఫారసులు చేస్తున్నారు. దీంతో పరిస్థితి గందరగోళంగా మారుతోంది.అర్బన్ తహసిల్దారు కార్యాలయానికి వచ్చేందుకు చుట్టుపక్కల మండలాల అధికారులు, ఉద్యోగులు తీవ్రంగా యత్నిస్తున్నారు.ఇక్కడ పనిచేసే రెవిన్యూ ఉద్యోగులకు భారీగా అక్రమాదాయం వుండడమే ఇందుకు కారణం. ఇక్కడ పనిచేసిన ఓ డీటీ ఒకరు రూ. వంద కోట్లకు పైగా వెనకేసుకున్నారన్న ఆరోపణలున్నాయి.తిరుపతి అర్బన్‌లో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కావడం వెనుక ఆ డీటీ పాత్ర కీలకంగా వుందన్న ఆరోపణలున్నాయి. మరో ఆర్ఐదీ అదే తీరని, సైలెంట్‌గా వుంటూ పని కానిచ్చేస్తారన్న పేరుందని సమాచారం.వీరి అక్రమార్జనను చూసి ఇతర ప్రాంతాల ఉద్యోగులు ఇక్కడికి వచ్చేందుకు పోటీ పడుతున్నట్టు సమాచారం. కాగా విద్యుత్ శాఖకు సంబంధించి గతంలో అనంతపురం జిల్లాలో కీలక పోస్టులో పనిచేసి ఇపుడు తిరుపతిలో వుంటున్న రిటైర్డు అధికారి ఒకరు బదిలీల విషయంలో హవా నడుపుతున్నట్టు ఆరోపణలున్నాయి.సదరు రిటైర్డు అధికారి నిర్ణయం మేరకు ముఖ్యనేత సిఫారసు చేస్తున్నట్టు పార్టీ వర్గాలే చెబుతున్నాయి. మొత్తం మీద తిరుపతిలో బదిలీల్లో ఎక్కువ మంది జోక్యం చేసుకుంటుండడంతో గందరగోళం నెలకొంటోంది.



మాటలతో మొదలై చేతలవరకూ.....

వెంకటగిరి మున్సిపల్ మీట్ రసాభాస

వెంకటగిరి, ఆగస్టు 31 : వెంకటగిరి మున్సిపల్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన అత్యవసర సమావేశం రసాభాసగా మారింది.ప్రారంభంలోనే జాతర నిర్వహణపై చర్చ మొదలైంది. గత వైసీపీ ప్రభుత్వంలో జాతర నిర్వహణకు మున్సిపల్ నిధులు ఖర్చు చేయలేదని, వైసీపీ ఇన్‌చార్జి రాంకుమార్ రెడ్డి నిధులతో జాతర నిర్వహించారంటూ 19వ వార్డు కౌన్సిలర్ వహీదా అనడంతో స్పందించిన 5వ వార్డు కౌన్సిలర్ నారి శేఖర్ లెక్కలు చూస్తే ఎవరెంత ఖర్చు చేశారో తెలుతుందన్నారు.వైసీపీ సింబల్‌తో కౌన్సిలర్‌గా గెలిచిన నీకు వైసీపీని విమర్శించే అర్హత ఎక్కడిదని వహీదా నిలదీస్తూ పరుష పదజాలం వినియోగించడంతో శేఖర్ టేబుల్‌పై వున్న వాటర్ బాటిల్‌ను ఆమెపైకి విసిరేశారు. దీంతో వహీదా తనకు న్యాయం చేయాలంటూ పోడియం వద్ద బైఠాయించింది. స్పందించిన ఛైర్‌పర్సన్ భానుప్రియ కౌన్సిలర్ నారిశేఖర్‌ను సమావేశం నుంచి సస్పెండ్ చేసి కౌన్సిల్ హాల్ విడిచి వెళ్లాలని ఆదేశించడం, ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ జోక్యంతో వివాదం సద్దుమణిగింది.వెంకటగిరి అభివృద్ధికి అటంకంగా పద్మశాలి కార్పొరేషన్ మాజీ డైరెక్టరు నక్కా వెంకటేశ్వరరావు తయారయ్యారని 14వ వార్డు కౌన్సిలర్ ఆరి శంకరయ్య ఆరోపించారు.ఆయన షాడో మున్సిపల్ ఛైర్మన్‌గా వ్యవహరించడం వల్ల అభివృద్ధి కుటుంబడిందని ఆరోపించారు. మొత్తం మీద జాతర నిర్వహణపై జరగాల్సిన సమావేశం కౌన్సిలర్ల ఆరోపణలు, ప్రత్యారోపణలకు వేదికైంది.


వహీదాకు సర్ది చెబుతున్న ఎమ్మెల్యే రామకృష్ణ

వర్షాల హెచ్చరికలతో జిల్లా యంత్రాంగం అప్రమత్తం

- ఆర్డీవోలతో జేసీ, డీఆర్వో వీడియో కాన్ఫరెన్స్
- ఆర్డీఓ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు

తిరుపతి(విద్య), ఆగస్టు 31:పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తుండడం, రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో తిరుపతి జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. విపత్తు నిర్వహణ సంస్థ జిల్లాకు ఎల్లో అలర్ట్ జారీ చేసి అప్రమత్తంగా ఉండాలని సూచించింది.దీంతో తిరుపతి, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట, గూడూరు ఆర్డీవో కార్యాలయాలతో పాటు మండల కేంద్రాల్లోనూ కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటయ్యాయి. కంట్రోల్‌రూముల్లో 24 గంటలూ సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. శనివారం సాయంత్రం జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, డీఆర్వో పెంచల కిషోర్ ఆర్డీవోలతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో ఎక్కడెక్కడ భారీ వర్షాలు కురిశాయని అధికారులను ఆరా తీశారు. ఐతే సముద్రతీర ప్రాంతాల్లోకూడా వర్షాలు కురవలేదని ఆర్డీవోలు తెలియజేశారు.అయినప్పటికీ జాగ్రత్తగా ఉండాలని, ఎటువంటి పరిస్థితులు ఎదురైనా తక్షణం స్పందించేలా సిద్ధంగా ఉండాలని జేసీ ఆదేశించారు.తహసీల్దార్లు కూడా అప్రమత్తంగా ఉంటూ, జిల్లా కేంద్రానికి సమాచారం తెలియజేస్తూ ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని, ఇబ్బందులు ఎదురైతే కంట్రోల్ రూమ్ నంబర్లకు కాల్‌చేసి సమాచారాన్ని తెలియజేయాలని కోరారు.

కంట్రోల్‌రూమ్ నంబర్లు

తిరుపతి కలెక్టరేట్ 0877-2236007.
తిరుపతి ఆర్డీఓ కార్యాలయం : 8686966559
శ్రీకాళహస్తి : 9959322935 - సూళ్లూరుపేట:8897265235
గూడూరు : 08624-252807.

తిరుమలలో చిరుజల్లులు


చినుకుల కారణంగా నిర్మానుష్యమైన తిరుమల మాడవీధులు

తిరుమల, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం తిరుమల క్షేత్రంలోనూ కనిపించింది. శుక్రవారం సాయంత్రం నుంచే నల్లటి మేఘాలు తిరుమలను కప్పేశాయి.శుక్రవారం రాత్రి నుంచి శనివారం రాత్రి వరకు చిరుజల్లులు కురుస్తూనే ఉన్నాయి. చిన్నపాటి చినుకులే కావడంతో భక్తులు కూడా వర్షంలో తుడుస్తూనే దర్శనానికి వెళ్లడం, తిరిగి బయటకు రావడం కనిపించింది. కాలినడక భక్తులు కూడా వర్షంలో తడుస్తూనే రాకపోకలు సాగించారు.తిరుమలలో చలి విపరీతంగా పెరిగింది. శ్రీవారి దర్శనార్థం వచ్చిన చిన్నపిల్లలు, వృద్ధులు ఇబ్బంది పడుతూ కనిపించారు. ఘాట్‌రోడ్లలో ప్రయాణించే ద్విచక్రవాహనదారులు జల్లులతో ఇబ్బందిపడ్డారు.

విద్యుత్ వినియోగదారులు అప్రమత్తంగా వుండాలి


ఎస్పీడీసీఎల్ సీఎండీ కె.సంతోషరావు

తిరుపతి(ఆటోనగర్)ఆగస్టు31:వర్షాల నేపథ్యంలో విద్యుత్ వినియోగదారులు అప్రమత్తంగా వుండాలని సదరన్ డిస్కం సీఎండీ కె.సంతోషరావు ఒక ప్రకటనలో కోరారు. సదరన్ డిస్కం పరిధిలో విద్యుత్ సరఫరా పర్యవేక్షణకోసం ప్రత్యేకంగా నోడల్ అధికారులను నియమించామని తెలిపారు.విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిన ప్రాంతాల్లో నోడల్ అధికారులు యుద్ధప్రాతిపదికన సరఫరా పునరుద్ధరణ పనులు చేపడతారని తెలిపారు.అనంతపురం సర్కిల్‌కు సీజీఎం వరకుమార్,నెల్లూరు సర్కిల్‌కు సీజీఎం ఆదిశేషయ్య, తిరుపతి సర్కిల్‌కు జనరల్ మేనేజరు సి.హెచ్.రామచంద్రరావు,కడప సర్కిల్‌కు జీఎం పి.మురళి, కర్నూలు సర్కిల్‌కు ఎస్.కె.ఇస్మాయిల్‌అహ్మద్ నోడల్ అధికారులుగా వ్యవహరిస్తారన్నారు. వర్షాలు కురుస్తున్న సమయంలో ప్రజలు విద్యుత్ స్తంభాలను తాకరాదని, తడి చేతులతో స్విచ్‌లు వేయరాదని, విద్యుత్ లైన్ల కింద నిలుచోరాదని సూచించారు. విద్యుత్ తీగలు తెగడం,స్తంభాలు కూలిపోయిన సమయంలో వెంటనే తమ సిబ్బందికి సమాచారం ఇవ్వాలని కోరారు.టోల్‌ఫ్రీ నెంబర్లు 1912 లేదా 18004251555333కు కాల్ చేసి సమాచారం తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.అలాగే 9133331912 నెంబరుకు విద్యుత్ సరఫరా అంతరాయాల సమాచారాన్ని చాటింగ్ చేయాలని కోరారు.

97.01 శాతం పింఛన్ల పంపిణీ


ఎర్రావారిపాళెం మండలం మేదరపల్లెలో లబ్ధిదారుకు పింఛను సొమ్ము అందజేస్తున్న ఎమ్మెల్యే నాని

- రాత్రి 7 గంటల సమయానికి 2,59,101 మందికి అందజేత
- రెండో స్థానంలో జిల్లా

తిరుపతి(విద్య), ఆగస్టు 31: జిల్లాలో ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్లను ఒకరోజు ముందుగానే పంపిణీ చేయడంపై లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. తొలిరోజునే 97.01 శాతం పంపిణీ పూర్తయ్యింది. సెప్టెంబరు ఒకటో తేదీ ఆదివారం రావడంతో లబ్ధిదారులు ఇబ్బంది పడకూడదని సీఎం చంద్రబాబు ఒక రోజు ముందుగానే శనివారమే పింఛన్లను పంపిణీ చేయాలని ఆదేశించారు. ఆ మేరకు కలెక్టర్ వెంకటేశ్వర్ ఏర్పాట్లు చేశారు. ఉదయం ఆరు గంటల నుంచే పంపిణీ ప్రారంభించి, తొలిరోజునే వంద శాతం పంపిణీ పూర్తి చేయాలని ఆదేశించారు. తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ మౌర్యతో కలిసి కలెక్టర్ స్వయంగా నగరంలోని పలు ప్రాంతాల్లోని లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లను పంపిణీ చేశారు.లబ్ధిదారులతో మాట్లాడి, సమస్యలేమైనా ఉన్నాయా అంటూ ఆరా తీశారు.చంద్రగిరి,తిరుపతి,గూడూరు,వెంకటగిరి,సూళ్లూరుపేట,సత్యవేడు నియోజకవర్గాల ఎమ్మెల్యేలతో పాటు ప్రజాప్రతినిధులు,కూటమి పార్టీల నేతలు పింఛన్ల పంపిణీలో సచివాలయ సిబ్బందితో కలసి పాల్గొన్నారు. జిల్లావ్యాప్తంగా 2,67,089 మంది లబ్ధిదారులుండగా.. శనివారం రాత్రి ఏడు గంటల సమయానికి 2,59,101 మంది (97.01 శాతం)కి పింఛన్లు పంపిణీ చేశారు. దీంతో రాష్ట్రంలో జిల్లా రెండో స్థానంలో నిలిచిందని కలెక్టర్ తెలిపారు.

డ్రగ్స్ ఫ్రీ తిరుపతి

- అవగాహన ర్యాలీలో గొంతెత్తిన విద్యార్థులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 31: డ్రగ్స్ ఫ్రీ ఇండియా.. డ్రగ్స్ ఫ్రీ ఏపీ.. డ్రగ్స్ ఫ్రీ తిరుపతి.. డ్రగ్స్ ఫ్రీ యూనివర్సిటీ.. పేరుతో తిరుపతిలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఎస్వీయూ ఎన్ఎస్ఎస్ విభాగం - తిరుపతి పోలీసు శాఖ సంయుక్తంగా మత్తు పదార్థాల వ్యతిరేకంగా శనివారం ఎస్వీయూ పరిపాలనా భవనం నుంచి ఈ ర్యాలీ చేపట్టాయి. ఎన్టీఆర్ సర్కిల్ దాకా సాగిన ఈ ర్యాలీలో అధిక సంఖ్యలో విద్యార్థులు, ఉద్యోగులు, పోలీసులు పాల్గొన్నారు. ర్యాలీని ఎస్పీ సుబ్బరాయుడు, ఎస్వీయూ ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. విద్యార్థులు, యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు. లేకుంటే తీవ్ర శిక్షలకు గురికావాల్సి ఉంటుందని హెచ్చరించారు. డ్రగ్స్‌పై 80999 99977 నెంబరుకు సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. డ్రగ్స్ అనుమానిత ప్రాంతాల్లో పోలీసు పెట్రోలింగ్, నిఘా పెట్టామన్నారు. జిల్లాలో డ్రగ్స్‌ను సమూలంగా నివారించేందుకు పోలీసు శాఖ అన్ని ప్రయత్నాలు చేస్తోందని చెప్పారు. అయినా, డ్రగ్స్ నివారణకు విద్యార్థులు, ప్రజల సహకారం అవసరమని అన్నారు. ఎస్వీయూ ఇన్‌చార్జి వీసీ మాట్లాడుతూ.. మత్తు పదార్థాల మాయలో పడి యువత తమ విలువైన భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని కోరారు. భవిష్యత్తులోనూ పోలీసు శాఖతో కలిసి మరిన్ని కార్యక్రమాలు చేస్తామన్నారు. రిజిస్ట్రార్ మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్‌లు రాష్ట్రాన్ని డ్రగ్స్ రహితంగా మార్చేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ దామోదరం, అసిస్టెంట్ కో-ఆర్డినేటర్ పాకనాటి హరికృష్ణ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న ఎస్పీ సుబ్బరాయుడు, ఎస్వీయూ ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు తదితరులు

రేపు ఉద్యోగులకు, పెన్షనర్లకు వేతనాలు, పెన్షన్లు

తిరుపతి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ఆగస్టు నెల వేతనాలు, పెన్షన్లు సోమవారం అందనున్నాయి. 31వ తేదీ నాల్గవ శనివారం కావడం, సెప్టెంబరు ఒకటి ఆదివారం కావడంతో బ్యాంకులకు సెలవులు వచ్చాయి. దాంతో వేతనాలు, పెన్షన్లు సోమవారం వారి బ్యాంకు ఖాతాలకు జమ కానున్నాయి. జిల్లాలో 30,101 మంది రెగ్యులర్ ఉద్యోగులు, 900 మంది టైమ్ స్కేల్ ఉద్యోగులు, 2400 మంది కాంట్రాక్టు ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరికి వేతనాల కింద ప్రభుత్వం నెలవారీ సుమారు రూ. 200 కోట్లు చెల్లిస్తోంది. అలాగే 17వేల మంది రిటైర్డు ఉద్యోగులున్నారు. వారికి నెలవారీ పెన్షన్ల కింద రూ.64 కోట్ల దాకా చెల్లిస్తోంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక వరుసగా మూడోనెల కూడా ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు వేతనాలు, పెన్షన్లు తొలి తేదీల్లోనే అందనున్నాయి. గతంలో వైసీపీ ప్రభుత్వంలో ఏ నెలా వీరికి జీతాలు, పెన్షన్లు తొలి రెండు వారాల్లో అందిన దాఖలాలు లేవు. అయితే గతానికి భిన్నంగా ఇపుడు జూలై నుంచి తొలి ఒకటి రెండు తేదీల్లోనే ఖాతాల్లో వేతనాలు, పెన్షన్లు జమ చేస్తుండడంతో ఉద్యోగులు, పెన్షనర్లు నిశ్చింతగా ఉంటున్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే నాని


దీన్‌దార్లపల్లెలో పింఛన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

భాకరాపేట, ఆగస్టు 31: పేదల సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయమని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. చిన్నగొట్టిగల్లు మండలం దీన్‌దార్లపల్లె పంచాయతీలో శనివారం పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు బెల్లంకొండ మురళీ, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ శివకుమార్, కార్యదర్శి మదనమోహన, తెలుగు మహిళా అధ్యక్షురాలు చిట్టెమ్మ, ఎంపీటీసీ విజయ కుమారి, ఆర్వీ రమణారెడ్డి, మోహన్ రెడ్డి, కుమారస్వామి రెడ్డి, మౌలాలి, వెంకటరత్నం, మల్లికార్జున రెడ్డి, కృష్ణమూర్తి, చంద్రశేఖర్, శంకర, సుబ్రహ్మణ్యం రెడ్డి, లోకనాథం, చెన్నయ్య, మున్నాభాయ్, శేఖర్ గౌడ్, బెల్లంకొండ రమణ, గురుమూర్తి, హైదర్‌వలీ, ఎంపీడీవో సోమశేఖర రెడ్డి, తహసీల్దారు జనార్దన్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

పాకాల: మండలంలోని పదిపుట్లబైలు పంచాయతీ పరిధిలో శనివారం ఎమ్మెల్యే పులివర్తి నాని ఇంటింటికీ వెళ్లి పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకురాగా, అధికారులతో చర్చించి అక్కడికక్కడే పరిష్కరించారు. టీడీపీ సీనియర్ నేత వలపల దశరథ నాయుడు, జడ్పీటీసీ నంగా పద్మజరెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ బోయపాటి నాగరాజ నాయుడు, ఎంపీడీవో ప్రభాకర్, తహశీల్దార్ నిత్యానందబాబు, పంచాయతీ కార్యదర్శి మేనక, టీడీపీ నాయకులు కెసావిత్రి, ఎల్.కోటి, చిన్నబ్బ నాయుడు, నంగా బాబురెడ్డి, వి.కుమారస్వామి నాయుడు, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఎర్రావారిపాలెం: మండలంలోని మేదరపల్లెలో ఎమ్మెల్యే పులివర్తి నాని ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లను అందించారు.తహశీల్దార్ పరమేశ్వర స్వామి, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక విద్యతో ఉజ్వల భవిష్యత్తు: డీఈవో



తిరుచానూరు, ఆగస్టు 31: సార్వత్రిక విద్యతో ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవచ్చని డీఈవో వి.శేఖర్ అన్నారు. తిరుచానూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం ఓపెన్ స్కూల్ అధ్యయన కేంద్రాల సమన్వయకర్తలతో సమావేశం నిర్వహించారు. డీఈవో మాట్లాడుతూ ఉపాధిహామీ సిబ్బంది, కూలీలు, ఆటోడ్రైవర్లు తదితరులను కలిసి ఓపెన్ స్కూల్ ఉపయోగాలను వివరించాలని తెలిపారు.

నేటి నుంచి శ్రీవారి ఆలయంలో శుక్ల యజుర్వేద పారాయణం

తిరుమల, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): టీటీడీ నిర్వహిస్తున్న చతుర్వేద పారాయణంలో భాగంగా సెప్టెంబరు 1వ తేదీ నుంచి తిరుమల శ్రీవారి ఆలయంలో నాలుగో విడత శుక్ల యజుర్వేద పారాయణం ప్రారంభంకానుంది.రంగనాయక మండపంలో రోజూ ఉదయం 9 నుంచి 10 గంటల మధ్య వేదపండితులు శుక్ల యజుర్వేద పారాయణం చేయనున్నారు.

17న అనంతపద్మనాభ వ్రతం

తిరుమలలో సెప్టెంబరు 17న అనంతపద్మనాభ వ్రతం జరుగనుంది.ఉదయం 8.30 నుంచి 9.30 గంటల మధ్య శ్రీవారి సుదర్శన చక్రత్తాళ్వారుకు పుష్కరిణిలో ప్రత్యేక అభిషేకాదులు నిర్వహిస్తారు. అలాగే సెప్టెంబరు 5వ తేదీన బలరామ, వరాహ జయంతి ఉత్సవాలు జరుగనున్నాయి. 18వ తేదీన పౌర్ణమి గరుడసేవ, 28న సర్వఏకాదశి పర్వదినాలు ఉన్నాయి.

ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన కల్పించాలి

- డాక్టర్ అనూరాధ



తిరుమల, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన కల్పించడం చాలా అవసరమని కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ఏపీ, తెలంగాణ ప్రాంతీయ డైరెక్టర్ డాక్టర్ అనూరాధ తెలిపారు. తిరుమల శ్రీవారిని శనివారం దర్శించుకున్న ఆమె ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. తిరుపతిలో జరిగిన ప్రజారోగ్య జాతీయ సదస్సులో పాల్గొనేందుకు వచ్చానన్నారు. గ్రామాల్లో, మండలాల్లో, జిల్లా వ్యాప్తంగా అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు ఆరోగ్యాన్ని కాపాడుకోవడంపై సదస్సులో చర్చించామన్నారని చెప్పారు. పరిశ్రలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మలేరియా, మంకీపాక్స్, డెంగ్యూ వంటి రోగాలు పెరగకుండా అరికట్టడం అందరి బాధ్యతని తెలిపారు. వర్షాకాలంలో వచ్చే వైరల్ ఫీవర్లు ఐదురోజుల్లోనే తగ్గిపోతాయని, అయినప్పటికీ టెస్టులు చేయించుకోవడం మంచిదన్నారు. వ్యాక్సినేషన్ ద్వారా గుండెపోట్లు వస్తున్నాయనే ప్రచారం అవాస్తవమని, దీనిపై ప్రముఖ వైద్యులు కూడా పరిశోధనలు చేశారని ఓ ప్రశ్నకు బదులిచ్చారు. తిరుమలలో పరిశుభ్రత చాలా బాగుందని ప్రశంసించారు.

నేటినుంచి తిరుమల పుష్కరిణిలోకి భక్తుల అనుమతి

తిరుమల, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మోత్సవాల నేపథ్యంలో నెల ముందుగా నిర్వహించే మరమ్మతు పనులు పూర్తయి నూతన హంగులతో తీర్చిదిద్దబడిన శ్రీవారి పుష్కరిణిలోకి ఆదివారం నుంచి భక్తులను అనుమతించనున్నారు. ఆగస్టు 1 నుంచి 31వ తేదీ వరకు పుష్కరిణిలో మరమ్మతు పనులు చేపట్టారు. పాత నీటిని తొలగించి అడుగు భాగంలో పేరుకుపోయిన ఇసుక, పాచిని తొలగించడానికి దాదాపు వందమంది వాటర్‌వర్క్స్ సిబ్బంది రేయింబవళ్లు కష్టపడి స్వామి పుష్కరిణి శుద్ధి కార్యక్రమాన్ని పూర్తిచేశారు. పుష్కరిణి మెట్లను బంగారు రంగుల అద్దకంతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. దాదాపు కోటి లీటర్ల నీటితో స్వామి పుష్కరిణిని నింపి మరమ్మతులు పూర్తి చేశారు. ఈక్రమంలో ఆదివారం నుంచి పుష్కరిణిలోకి భక్తులను అనుమతించడంతో పాటు నెలరోజుల పాటు నిలిచిపోయిన పుష్కరిణి హారతి కూడా తిరిగి ప్రారంభం కానుంది.

వెంకన్న సేవలో ప్రముఖులు

తిరుమల శ్రీవారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సెంథిల్‌కుమార్, ఎమ్మెల్యే అరణి శ్రీనివాసులు, టీడీపీ ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, పీసీసీఎఫ్ ఆర్కే సుమన్, మాజీ మంత్రి రోజా, సినీ నటి రవళి ఉన్నారు.

నిర్మాణాలను అడ్డుకున్న రెవెన్యూ అధికారులు

మంగళం, ఆగస్టు 31: మంగళం గ్రామంలోని ధర్మరాజుగుడి వద్ద గ్రామస్తులు నిర్మాణాలు చేపడుతున్నారని అర్బన్ తహసీల్దారు భాగ్యలక్ష్మికి కొంత మంది ఫిర్యాదు చేయగా, ఆమె ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు శనివారం నిర్మాణాలను అడ్డుకున్నారు. నిర్మాణదారుడు మాట్లాడుతూ.. తాము ఈ స్థలానికి సంబంధించి రికార్డులు కలిగి ఉన్నామని అధికారులకు తెలిపాడు. రికార్డులను తహసీల్దారుకు చూపిన తరువాత నిర్మాణాలను చేసుకోవాలని రెవెన్యూ అధికారులు సూచించారు. దీంతో నిర్మాణాలను ఆపేశారు.

ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం ఇంటివద్దే విద్య

పాకాల, ఆగస్టు 31: మండల భవిత కేంద్రం ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఇంటివద్దనే విద్య కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని జిల్లా సహిత విద్య సమన్వయకర్త చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మండలంలోని తలారిపల్లె, ఫకీరుపేట, దేశిరెడ్డిపల్లె, దామలచెరువు, పాకాలలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు అందిస్తున్న ఇంటివద్దనే విద్య కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలకోసం ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సహిత విద్య ఉపాధ్యాయులు మునికృష్ణారెడ్డి, సుందరి తదితరులు పాల్గొన్నారు.

సెరికల్చర్ అధికారిణికి పదోన్నతి

తిరుపతి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): జిల్లా సెరికల్చర్ అధికారిగా పనిచేస్తున్న బి.గీతారాణి పదోన్నతిపై కాకినాడ జిల్లాకు బదిలీ అయ్యారు. సెరికల్చర్ శాఖలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఉన్న ఆమె ప్రస్తుతం తిరుపతి జిల్లా సెరికల్చర్ అధికారిగా పనిచేస్తున్నారు. 2023-24 పదోన్నతుల ప్యానెల్‌లో ఆమె పేరు చేర్చిన ప్రభుత్వం..దానికనుగుణంగా డిప్యూటీ డైరెక్టర్‌గా పదోన్నతి కల్పించింది. ఆ హోదాలో గీతారాణిని కాకినాడ జిల్లా సెరికల్చర్ అధికారిగా బదిలీ చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఈ పదోన్నతి తాత్కాలిక ప్రాతిపదికన కల్పిస్తున్నట్టుగా ఉత్తర్వుల్లో పేర్కొంది.

తుడాలో ఇక ఐఏఎస్‌ల పాలన

- వైసీపీ ప్రభుత్వంలో నాన్ ఐఏఎస్‌లతో ఇష్టారాజ్యం
- కూటమి ప్రభుత్వంలో మళ్లీ పాత సంప్రదాయం
- మున్సిపల్ కమిషనర్‌కు అదనపు బాధ్యతలు

తిరుపతి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా)లో ఇక ఐఏఎస్‌ల పాలన కొనసాగనుంది. 2019వరకు మున్సిపల్ కమిషనర్‌గా ఉన్న ఐఏఎస్ అధికారినే తుడా వీసీగా అదనపు బాధ్యతలు అప్పగించేవారు. దీంతో పాలనలో పారదర్శకత ఉండేది. అభివృద్ధి పనుల్లో తుడా-మున్సిపల్ కార్పొరేషన్ మధ్య చక్కని సమన్వయం కనిపించేది. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చాక అప్పటికే ఉన్న ఐఏఎస్ అధికారి కొన్ని వివాదాస్పదమైన ఫైల్స్‌పై సంతకం చేసేందుకు నిరాకరించినట్టు వార్తలొచ్చాయి. దీంతో ఐఏఎస్ అధికారిని తప్పించి నాన్-ఐఏఎస్ అధికార్లను నియమిస్తూ వచ్చారు. ఈనేపథ్యంలో తుడా నిధుల గోల్‌మాల్‌పై అనేక ఆరోపణలు వచ్చాయి. ఇటీవల మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ తుడాలో నిర్వహించిన సమీక్షలో సిబ్బంది జీతాలకే ఏడాదికి రూ.15కోట్లు వెచ్చించడంపై ఆశ్చర్యం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. తుడా ప్రక్షాళనలో భాగంగా పాత సంప్రదాయాన్నే ఎన్డీఏ కూటమి ప్రభుత్వం తెరపైకి తీసుకొచ్చింది. మున్సిపల్ కమిషనర్ నారపరెడ్డి మౌర్యకు పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. ఆమేరకు శనివారం ఆమె తుడా వీసీగా బాధ్యతలు చేపట్టారు.



తుడా అభివృద్ధికి కృషి చేస్తా : మౌర్య

తుడా అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని వైస్ ఛైర్మన్ మౌర్య అన్నారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆమె మాట్లాడారు. నగరపాలక సంస్థ, తుడాల అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు. ఈమెకు ఇన్‌చార్జి వీసీగా పనిచేసిన వెంకట నారాయణతోపాటు నగరపాలక సంస్థ, తుడా అధికారులు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.

రేషన్‌కార్డుదారులకు తీపి కబురు

- ఈనెల కోటాలోనే ఒక్కో కార్డుకు అరకిలో చక్కెర పంపిణీ

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 31: రేషన్ కార్డుదారులకు కూటమి ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఈనెల కోటాలో ఒక్కో కార్డుకు అరకిలో చక్కెర పంపిణీ చేసేలా ఆదేశాలు జారీ అయ్యాయి. జిల్లాలో 5,61,453 రేషన్ కార్డులున్నాయి. వీటి ద్వారా ప్రతి నెలా ఒక్కో మనిషికి ఐదు కిలోల లెక్కన బియ్యం ఉచితంగా అందజేస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలోని కార్డులకు అనుగుణంగా చక్కెర పంపిణీ చేయడానికి అన్ని చర్యలు చేపట్టారు. ఒక్కో కార్డుకు అరకిలో రూ.17 లెక్కన అందజేస్తామని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రాజా రఘువీరా తెలిపారు. ఎక్కడైనా చక్కెర పంపిణీ చేయకుంటే వెంటనే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. అంత్యోదయ అన్నయోజన కార్డులున్న వారికైతే కిలో చక్కెర అందచేస్తారు. వీటితోపాటు రాగులు అవసరమైన వారికి పంపిణీ చేయడానికి అధికారులు సిద్ధం చేస్తున్నారు. కానీ రాగులు ఎవ్వరూ అడగడంలేదని దీంతో కేవలం రెండు, మూడు టన్నులు మాత్రమే తెప్పిస్తున్నామని పేర్కొన్నారు.

అక్టోబరు నుంచి గోధుమ పిండి, కందిపప్పు

అక్టోబరు నుంచి రేషన్ కార్డుదారులకు బియ్యం, చక్కెరతో పాటు కందిపప్పు, గోధుమపిండి పంపిణీ చేయనున్నారు.జిల్లాకు 595టన్నుల కందిపప్పు, మరో 595టన్నుల గోధుమలు అవసరం ఉందని జిల్లా అధికారులు ప్రతిపాదనలు సిద్ధంచేసి ప్రభుత్వానికి పంపారు.త్వరలోనే చిరు ధాన్యాలను రైతుల నుంచి నేరుగా కొనుగోలు చేసి రేషన్ షాపుల ద్వారా పంపిణీకి సిద్ధం చేస్తున్నట్లు జిల్లాఅధికారి ఒకరు తెలిపారు.

మఠం భూముల్లో నిర్మాణాల పరిశీలన


వివరాలు తెలుసుకుంటున్న రూరల్ తహసీల్దార్

తిరుపతి రూరల్, ఆగస్టు 31: వేదాంతపురం పంచాయతీ పరిధిలో విద్యుత్‌నగర్‌లోని సర్వే నెంబరు 368లో హథీరాంజీ మఠం భూముల్లో చేపడుతున్న నిర్మాణాలనురూరల్ మండల రెవెన్యూ సిబ్బందితో కలసి తహసీల్దార్ రామాంజులు నాయక్ శనివారం పరిశీలించారు. ఈ స్థలంలో బంజారా సంఘం ఆధ్వర్యంలో కొత్తగా నిర్మిస్తున్న హథీరాం బావాజీ ఆలయంతోపాటు ఇతర నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఈ భూమికి సంబంధించిన రికార్డులు, అనుమతులు వంటి వివరాలపై ఆలయ కమిటీ అధ్యక్షుడు శివానాయక్‌ను అడిగి తెలుసుకున్నారు. వారివద్ద ఉన్న పత్రాలను పరిశీలించి స్థానిక వీఆర్వోకి అందజేయాలని సూచించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ.. వేదాంతపురంలో సర్వేనెంబరు 364, 368లలో హథీరాంజీ మఠానికి చెందిన 26 ఎకరాల భూమి ఉందని, కలెక్టర్ ఆదేశాల మేరకు 368లో చేపడుతున్న నిర్మాణాలను పరిశీలించామని తెలిపారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు శివానాయక్ మాట్లాడుతూ.. హథీరాం బావాజీకి తిరుపతిలో వేల ఎకరాల స్థలం ఉన్నా ఆలయాన్ని నిర్మించలేదని, బంజారా ప్రజల కోరికమేరకు గతంలో మఠానికి చెందిన స్వామిజీ (మహంతు అర్జున్‌దాస్) ఆలయ నిర్మాణానికి ఈ భూమిని కేటాయించారని తెలిపారు. ఈ స్థలంలో బావాజీ, అమ్మవారి ఆలయాలతోపాటు భక్తులకు కాటేజీలు నిర్మిస్తున్నామని చెప్పారు. ఈ భూమి విషయమై హైకోర్టులో కేసు నడుస్తోందని తెలిపారు. సర్వేయర్ కరుణకుమార్, ఆర్ఐ శివకుమార్, వీఆర్వో శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న ఎస్ఐ రామాంజనేయులు

రామచంద్రాపురం, ఆగస్టు 31: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ రామాంజనేయులు అన్నారు. శనివారం మండలంలోని కుప్పంబాదూరు పంచాయతీ ఒడ్డికాల్వ దళితవాడలో మండల స్థాయి అధికారులు పౌరహక్కులపై దళితులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ.. సైబర్ నేరాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు.గ్రామాల్లో మద్యం బెల్టు దుకాణాలు, నాటు సారా తయారీ విక్రయాలు జరిగితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఆర్ఐ కృష్ణమ్మ, వీఆర్వో చిరంజీవి, నీటిపారుదలశాఖ, సచివాలయ సిబ్బంది, గ్రామప్రజలు పాల్గొన్నారు.

దుకాణంలో స్వల్ప అగ్నిప్రమాదం

తిరుమల, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): తిరుమలలోని ఓ దుకాణంలో శనివారం స్వల్ప అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. హెల్త్ ఆఫీస్‌కు సమీపంలోని ఓ హాకర్ లైసెన్స్ (తట్ట)లో మంటలు వ్యాపించడాన్ని అక్కడి దుకాణదారులు గుర్తించారు.వెంటనే ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో ఫైర్ సిబ్బంది ఘటనా ప్రాంతానికి వేగంగా చేరుకుని మంటలను అదుపుచేశారు. దీంతో అక్కడివారు ఊపిరి పీల్చుకున్నారు.

నేనెవరికీ లంచాలు ఇవ్వలేదు


మీడియాతో మాట్లాడుతున్న రాము

తిరుపతి అర్బన్, ఆగస్టు 31: ఎమ్మెల్యే పులివర్తి నానీపై వచ్చిన ఆరోపణలు అవాస్తవమని, ఖండిస్తున్నట్లు చంద్రగిరి మండలం కోటకు చెందిన సింగంశెట్టి రాము తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ చంద్రగిరి కోట ఎదురుగా హైవే పక్కన 312, 313 సర్వే నెంబర్లలో ఎకరా 18 సెంట్ల వ్యవసాయ భూమి తనకు ఉందన్నారు. అందులో హోటల్ నిర్మాణం చేపడుతున్నామని, కొందరు దీనిపై రాద్ధాంతం చేస్తున్నారని, ఎమ్మెల్యే నానీకి, టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడికి లంచాలు ఇచ్చినట్లు సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. తన బిడ్డల సాక్షిగా ఎవరికీ లంచాలు ఇవ్వలేదని వాపోయారు. కొందరు లబ్ధి పొందాలనే ఆలోచనతో పనిగట్టుకుని ఆరోపణ చేయడం భావ్యం కాదన్నారు. ఈ విషయంలో తన తప్పిదం లేదని అర్థం చేసుకోవాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు.

పోగొట్టుకున్న బ్రాస్లెట్ భక్తురాలికి అప్పగింత


బ్రాస్లెట్‌ను భక్తురాలికి అప్పగిస్తున్న ఆలయ అధికారులు

చంద్రగిరి, ఆగస్టు 31: శ్రీనివాస మంగాపురం కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఓ భక్తురాలు పోగొట్టుకున్న బంగారు బ్రాస్లెట్‌ను ఆలయ అధికారులు తిరిగి ఆమెకు అందచేశారు. వివరాలిలా ఉన్నాయి. శనివారం రాజంపేటకు చెందిన శ్రీలత కల్యాణ వెంకన్న దర్శనానికి వచ్చి తన బంగారు బ్రాస్లెట్‌ను ఆలయంలో పోగొట్టుకుంది. ఇది భద్రతా సిబ్బందికి దొరకడంతో వారు ఆలయ అధికారులకు అప్పగించారు. సూపరింటెండెంట్ మునిచెంగల్రాయులు, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్‌లు మైక్ ద్వారా అనౌన్స్ చేశారు. ఈ ప్రకటన విన్న శ్రీలత అధికారుల వద్దకు రాగా, వారు ఆమె నుంచి వివరాలు సేకరించి, నిర్ధారించుకున్న తర్వాత బ్రాస్లెట్‌ను అప్పగించారు. దీంతో ఆమె ఆలయ అధికారులకు, భద్రతా సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపింది. ఈకార్యక్రమంలో జమేదార్ జలంధర్, సిబ్బంది పాల్గొన్నారు.

చెత్తదిబ్బను తొలగించరా?

తిరుపతి అర్బన్, ఆగస్టు 31: తిరుపతిలోని కరుమారియమ్మ ఆలయం వద్ద చెత్త దిబ్బ భక్తులను అసహనానికి గురిచేస్తోంది. ఇటీవల కాలువల నుంచి బయటకు తీసిన వ్యర్థాలను ఆలయం వద్ద ఇలా పెద్ద గుట్టలా నిల్వ చేశారు. దీంతో ఈ ప్రాంతమంతా దుర్గంధం వెదజల్లుతోంది. కార్పొరేషన్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



టూరిజం నకిలీ దర్శన టికెట్ల కేసులో
మరో ఇద్దరి అరెస్ట్


సీఐ అదుపులో నారాయణ, అరసు

తిరుమల, ఆగస్టు31(ఆంధ్రజ్యోతి): టూరిజం నకిలీ దర్శన టికెట్ల కేసు వ్యవహారంలో తిరుమల పోలీసులు మరో ఇద్దరిని అరెస్ట్ చేశారు. ఏపీ టూరిజం పేరిట ఉన్న నకిలీ దర్శన టికెట్లతో ఓ ముఠా సాగించిన అక్రమాలు ఆగస్టు20వ తేదీన వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. చెన్నైకి చెందిన ఎంపైర్ ట్రావెల్స్ సంస్థ నిర్వాహకులతో కుమ్మక్కై నకిలీ టికెట్లను స్కాన్ చేస్తున్నట్టు నటించి భక్తులను అనుమతిస్తున్న అక్రమం కలకలం సృష్టించింది. ఈ కేసులో కాంట్రాక్ట్ ఉద్యోగి రుద్రసాగర్‌తో పాటు కేవీఎస్ సంస్థలో పనిచేసిన మాజీ ఉద్యోగి నవీన్, ట్రావెల్స్‌కు చెందిన పెరియస్వామిని విజిలెన్స్ ఫిర్యాదుతో పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం ఈ కేసులో ఎవరెవరున్నారు, వీరికి టీటీడీ ఉద్యోగులు ఏమైనా సహకరించారా అనే అంశాలపై టూటౌన్ సీఐ సత్యనారాయణ విచారణ జరిపారు.కేవీఎం సంస్థలో గతంలో పనిచేసిన నారాయణ పాత ఏపీ టూరిజం టికెట్లను ఎంపైర్ ట్రావెల్స్ ఉద్యోగి అరసుకు పంపగా రూ.15 వేలకు మోహన్‌రాజు అనే వ్యక్తికి విక్రయించి తిరుమలకు పంపినట్టు పోలీసుల విచారణలో తేలింది. దీంతో నారాయణతో పాటు అరసును అరెస్ట్ చేసి వారి సెల్‌ఫోన్లను సీజ్ చేశారు. వారి బ్యాంకు ఖాతాలను పరిశీలించడంతో పాటు వారికి ఎవరెవరితో సంబంధాలున్నాయనే అంశాలపై దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

తోపుడు బండ్ల వ్యాపారులకు
అన్యాయం చేయొద్దు: సీపీఐ

తిరుపతి(ఆటోనగర్), ఆగస్టు 31: బైరాగిపట్టెడలోని శ్రీపద్మావతి పార్కు వద్ద తోపుడు బండ్ల వ్యాపారులకు అన్యాయం చేయొద్దని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం సాయంత్రం పార్కు వద్ద వ్యాపారులతో కలిసి నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ 15 ఏళ్లుగా పేదలు తోపుడు బండ్లపై వ్యాపారాలు చేసుకుంటూ జీవిస్తున్నారని చెప్పారు. జనసేన, టీడీపీ నాయకులు రాత్రికి రాత్రే బంకులను పెట్టి తోపుడు బండ్లను తొలగించడం అన్యాయమన్నారు. కేశవాయనిగుంటలో ఉన్న మణి తన అనుచరులతో వచ్చి వ్యాపారులపై దాడులు చేసి భయభ్రాంతులకు గురిచేస్తున్నాడని ఆరోపించారు. వీరిపై ఎమ్మెల్యే, పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు ఎన్.డి.రవి, విశ్వనాథ్, శివకుమార్, రామకృష్ణ, శ్రీనివాసులు, వ్యాపారులు పాల్గొన్నారు.

నేడు డిఫెన్స్ సర్వీసెస్ పరీక్షలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు/విద్య), ఆగస్టు 31: యూపీఎస్సీ చేపట్టిన నేషనల్ డిఫెన్స్ అకాడమీ అండ్ నావెల్ అకాడమీ, కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్-2024 పరీక్షలు ఆదివారం తిరుపతిలో నిర్వహించనున్నారు. మూడు (శ్రీపద్మావతి బాలికల ఉన్నత పాఠశాల, శ్రీపద్మావతి మహిళా జూనియర్ కళాశాల వింగ్-ఏ, వింగ్-బీ) కేంద్రాల్లో నిర్వహించే ఈ పరీక్షలకు 821 మంది అభ్యర్థులు హాజరు కానున్నారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లను డీఆర్వో పెంచల్ కిషోర్ పరిశీలించారు. కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్షించారు. పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో యూపీఎస్సీ సెక్షన్ ఆఫీసర్ శశిభూషణ్, ఆర్డీవో నిశాంత్‌రెడ్డి, సెట్విన్ సీఈవో మురళీకృష్ణ, డీఎంహెచ్‌వో శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

మాపై దయ చూపండి

తిరుపతి(విద్య), ఆగస్టు 31: ముఖ్యమంత్రి మాపై కనికరం చూపుతున్నారు. కానీ కొందరు ఉన్నతాధికారులు మాత్రం మాపై దయలేకుండా వ్యవహరిస్తున్నారు' అని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు తోటకూర కోటేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. పోస్టల్ కాలనీలోని సమాఖ్య కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీని మూడ్రోజుల్లోగా పూర్తిచేయాలని సీఎం ఆదేశించారన్నారు. కొందరు ఉన్నతాధికారులు ఒక్కరోజులోనే పూర్తి చేయాలని తీవ్రంగా ఒత్తిడి చేస్తున్నారన్నారు. ఈక్రమంలో శనివారం సచివాలయ కార్యదర్శులు పలువురు ప్రమాదాల బారినపడి ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని చెప్పారు.

వకుళమాతకు పట్టువస్త్రాలు

తిరుపతి రూరల్, ఆగస్టు 31: తిరుపతి రూరల్ మండలం పాతకాల్వలో వున్న వకుళమాత ఆలయానికి శనివారం ఏకవీర ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ప్రతాప్‌స్వామి, బీజేపీ నేత గుండాల గోపీనాథ్ రెడ్డి పట్టువస్త్రాలను సమర్పించారు.

రేషన్ డీలర్ల సంఘం నూతన కార్యవర్గం



కోటేశ్వర నాయుడు - హేమలత

తిరుపతి రూరల్, ఆగస్టు 31: స్థానిక తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో శనివారం నిర్వహించిన తిరుపతి రూరల్ మండల రేషన్ డీలర్ల సంఘ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వెంకటేశ్వరరెడ్డి నేతృత్వంలో నిర్వహించిన ఈ సమావేశంలో నూతన అధ్యక్ష, ప్రధానక్యాదర్శులుగా జి.కోటేశ్వర నాయుడు, పి.హేమలత, గౌరవాధ్యక్షుడిగా పి.మునికృష్ణారెడ్డి, కోశాధికారిగా కె.దొరస్వామియాదవ్, కార్యనిర్వాహక కార్యదర్శి బి.ఏలుమలై, కార్యదర్శిగా టి.కళ్యాణ్, ఉపకార్యదర్శిగా పి.మునెమ్మ, సహాయకార్యదర్శిగా సుబ్బయ్య, ముఖ్యసలహాదారుగా జి.హరి, కార్యవర్గసభ్యులుగా పి.సుజాత, పి.రామకృష్ణయ్య, డి.హరినాథ్ నాయుడు, బి.భానుమతి, బి.మునిరాజా, సి.దేవా, కె.నారాయణలను ఎన్నుకున్నారు. జిల్లా ప్రధానకార్యదర్శి సాల్మన్‌రాజు, అర్బన్ మండల అధ్యక్షుడు సి.చంద్రశేఖర్‌రెడ్డి, డీలర్లు పాల్గొన్నారు.

తిరుమలలో ట్రాఫిక్ నిబంధనలు పాటించాల్సిందే


డ్రైవర్లతో మాట్లాడుతున్న హరిప్రసాద్

తిరుమల, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో ట్యాక్సీ డ్రైవర్లు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాల్సిందేనంటూ ట్రాఫిక్ సీఐ హరిప్రసాద్ ఆదేశించారు. ఇప్పటికే తిరుమలలో నిబంధనలు అతిక్రమించిన 40 ట్యాక్సీలకు నాట్ అలౌడ్ పెట్టారు. వారితో రూ.40వేలు శ్రీవారి కానుక కట్టించి శనివారం సాయంత్రం తిరుమలలోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ వద్ద అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ... శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులను నిబంధనల ప్రకారమే వాహనాల్లోకి ఎక్కించుకోవడం, నిర్ణయించిన ఛార్జీలే తీసుకోవడం, నిర్దేశించిన సమయంలోనే ఘాట్‌రోడ్లలో రాకపోకలు సాగించాలని సూచించారు. వాహనాలకు సంబంధించిన పత్రాలతో పాటు లైసెన్సు ఉన్నవారే ట్యాక్సీలు నడపాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

పాకాల రైల్వే స్టేషన్‌ను సందర్శించిన డీఆర్ఎం


రైల్వే విశ్రాంత ఉద్యోగుల సమస్యలు తెలుసుకుంటున్న విజయకుమార్

పాకాల, ఆగస్టు 31: గుంతకల్లు డీఆర్ఎం విజయకుమార్ శనివారం పాకాల రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మోడరన్ రైల్వే స్టేషన్‌గా అభివృద్ధి చేసి ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. తిరుపతి వయా పాకాల - కాట్పాడి డబుల్ రైల్వే ట్రాక్ పనులు త్వరలో ప్రారంభమవుతాయన్నారు. ప్రయాణికుల సౌకర్యం కోసం ఈ మార్గంలో ప్రత్యేక రైళ్లు నడిచేలా చర్యలు చేపడతామని తెలిపారు. ఈ సందర్భంగా రైల్వే విశ్రాంత ఉద్యోగుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైల్వేఅధికారులు, స్థానిక సిబ్బంది పాల్గొన్నారు.

అణగారిన వర్గాల పట్ల వివక్ష చూపరాదు

భాకరాపేట, ఆగస్టు 31: సమాజంలోని అణగారిన వర్గాల పట్ల వివక్ష చూపరాదని వీఆర్వో మల్లికార్జున రెడ్డి అన్నారు. చిన్నగొట్టిగల్లు మండలం చెరువుముందరపల్లెలో శనివారం పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించి, ప్రతిజ్ఞ చేయించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న భూమి, దారి తదితర సమస్యలను అర్జీల రూపంలో ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ హాస్టల్ వార్డెన్ వెంకటేశ్వరరావు, సర్వేయర్ కేశవులు, ఎంఆర్‌పీఎస్ నాయకుడు గురుశంకరప్రసాద్, 'విన్స్' కో-ఆర్డినేటర్ రహంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్‌కు నూతన కార్యవర్గం



రామచంద్రాపురం, ఆగస్టు 31: రామచంద్రాపురంలోని గీతాంజలి పాఠశాల వద్ద శనివారం ఏపీ ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ మండల నూతన పాలకవర్గాన్ని ఎన్నుకున్నారు. రాయలసీమ రీజినల్ అధ్యక్షుడు విశ్వనాథరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై నూతన పాలకవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా ఎన్.మాధవి, కార్యదర్శిగా గిరికుమార్ రెడ్డి, కోశాధికారిగా రహీమ్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా సత్యనారాయణ, వైస్‌ప్రెసిడెంట్‌గా ఇమ్రాన్‌ఖాన్, సంయుక్త కార్యదర్శిగా మాధవి, ఈసీ మెంబర్లుగా నాగేంద్ర, చంద్రశేఖర్, మధు, రాజశేఖర్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, రవీంద్రనాథ్, వెంకటరమణారెడ్డి, జనార్ధన్‌రెడ్డి, భాస్కర్ రాజు, ఎస్ఎం బాషా తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్ర పరిశీలన

తిరుచానూరు, ఆగస్టు 31: తిరుపతి రూరల్ మండలం వేమూరులో అయ్యప్పనాయుడు తన పొలంలో పాటిస్తున్న ప్రకృతి వ్యవసాయ పద్ధతులను తెలుసుకోవడానికి తమిళనాడు గ్రామీణ అభివృద్ధి, పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో ఓ బృందం క్షేత్రస్థాయి పరిశీలనకు శనివారం విచ్చేశారు. జిల్లా ప్రాజెక్టు మేనేజరు షణ్ముగం వారికి ప్రకృతి వ్యవసాయ పద్ధతుల గురించి వివరించారు. అదే విధంగా అయ్యప్ప నాయుడు పొలంలో 20 సెంట్లలో వేసిన ఏటీఎం మోడల్‌ను పరిశీలించారు. కషాయాల తయారీ విధానాన్ని వివరించారు. ఎన్ఎఫ్ఏ మధు, నీలమ్మ, ఐసీఆర్‌పీ రాధిక, ధరణి, శ్రావణి, చెంచులక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి

జాషువా సాహిత్యంతో సామాజిక చైతన్యం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 31: గుర్రం జాషువా సృజించిన సాహిత్యం సామాజిక చైతన్యాన్ని కల్గిస్తూ ఉందని పద్మావతి డిగ్రీ-పీజీ కాలేజీ తెలుగు అధ్యాపకురాలు డాక్టర్ కస్తూరి అభిప్రాయపడ్డారు. పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం తెలుగు విభాగంలో సాహితీ సమితి సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సాంఘిక దురాచారాలను తన సాహిత్యం ద్వారా ఖండించిన ప్రత్యేకత జాషువాదన్నారు. వర్సిటీ తెలుగు విభాగాధిపతి ఆచార్య కొలకలూరి మధుజ్యోతి మాట్లాడుతూ.. సాహిత్యం పట్ల విద్యార్థుల్లో అవగాహనకు నిరంతరం ప్రయత్నిస్తున్నామన్నారు. సమితి సలహాదారు డాక్టర్ డి.యువశ్రీ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో సాహిత్యం పట్ల మరింత అభిరుచి కల్పించే లక్ష్యంతో అతిథి ఉపన్యాసాలు ఇప్పిస్తున్నామని తెలిపారు. అధ్యాపకులు డాక్టర్ వై.సుభాషిణి, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భారీ వాహనాలకు రైట్.. రైట్

అనుమతి లేని సమయాల్లో నగరంలోకి రావడంతో ట్రాఫిక్ కష్టాలు


నగరంలోకి మధ్యాహ్నం సమయంలో వచ్చిన భారీ వాహనం

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 31: నగరంలోకి ఉదయం ఎనిమిది నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు భారీ వాహనాలకు అనుమతి లేదు. అయితే రెండు నెలలుగా అనుమతిలేని సమయంలోనే భారీ వాహనాలు ఎక్కువగా నగరంలోకి వస్తున్నాయి. దీనివల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఇటీవల దేవేంద్ర థియేటర్ రోడ్డు, లీలామహల్ నుంచి తుడా రోడ్డు, మార్కెట్, తిలక్ రోడ్డు, వీవీ మహల్ రోడ్డు, కపిలతీర్థం రోడ్డు ప్రాంతాల్లో 10, 12 చక్రాల లారీలు మధ్యాహ్నం పూట నడిరోడ్డుపై ఆపి అన్‌లోడ్ చేసి వెళుతున్నాయి. ఎప్పుడూ రద్దీగా ఉండే తిలక్, వీవీ మహల్ రోడ్లలోనూ భారీ వాహనాలు చక్కర్లు కొడుతున్నాయి. వీటి కారణంగా ట్రాఫిక్ దాదాపు అరగంట నుంచి 45 నిమిషాలపాటు స్తంభిస్తోంది. ట్రాఫిక్ వ్యవస్థ గాడి తప్పడం వల్లే ఇలా జరుగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

హీరో కృష్ణ అభిమానికి చేయూత


కృష్ణారెడ్డికి నగదు అందజేస్తున్న కృష్ణ అభిమానులు

తిరుపతి (జీవకోన), ఆగస్టు 31: సూపర్‌స్టార్ కృష్ణ అభిమాని కృష్ణారెడ్డికి ఫ్యాన్స్ అసోసియేషన్ అండగా నిలిచింది. ఇటీవల పక్షవాతం బారినపడ్డ కృష్ణారెడ్డికి కృష్ణ అభిమానులు శనివారం రూ.21,116 అందించారు.

సమాచార శాఖకు డిజిటల్ కెమెరా

తిరుపతి(విద్య), ఆగస్టు 31: తిరుపతి సమాచార శాఖ కార్యాలయానికి నూతన డిజిటల్ ఫొటో కెమెరాను కలెక్టర్ వెంకటేశ్వర్ అందజేశారు. శనివారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో సమాచార పౌర సంబంధాల జిల్లా అధికారి బాలకొండయ్యకు ఈ కెమెరాను అందించారు. డీఆర్వో పెంచల కిషోర్, ఫొటోగ్రాఫర్ రవీంద్ర, సిబ్బంది మల్లికార్జున, సురేష్ పాల్గొన్నారు.


ఎస్వీ నగర్‌లో లబ్ధిదారుకు పింఛను సొమ్ము అందజేస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, కమిషనర్ మౌర్య

నగరంలో 97.73 శాతం పింఛన్ల పంపిణీ

తిరుపతి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): సెప్టెంబరు ఒకటో తేదీ ఆదివారం కావడంతో ఒక రోజు ముందే ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీని కూటమి ప్రభుత్వం చేపట్టింది. నగరంలో శనివారం ఉదయం ఐదు గంటలకే పింఛన్ల పంపిణీ ప్రారంభించారు. రాత్రి ఎనిమిది గంటల సమయానికి 97.73శాతం మందికి పంపిణీ చేశారు. 19,131 మంది లబ్ధిదారులుండగా 18,696 మందికి ఒక్కరోజులోనే పంపిణీ చేశారు. మిగిలినవారికి సోమవారం అందజేయనున్నారు. 768 మంది సచివాలయ సిబ్బంది పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మలు పీర్ల చావడి, గిరిపురం ప్రాంతాల్లో పెన్షనర్లకు నగదు అందించారు. లబ్ధిదారులతో మాట్లాడగా, ఒక రోజు ముందుగానే పింఛను అందజేయడంపై ఆనందం వ్యక్తం చేశారని ఎమ్మెల్యే తెలిపారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నేతృత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని ధీమా వ్యక్తం చేశారు.


కూటమి నేతలతో కలిసి లబ్ధిదారుకు పింఛను సొమ్ము అందజేస్తున్న ఆరణి, సుగుణమ్మ

10వేల మొక్కలు నాటుతాం: జనసేన

తిరుపతి అర్బన్, ఆగస్టు 31: ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ జన్మదినం సందర్భంగా ఈనెల రెండో తేదీన జనసేన ఆధ్వర్యంలో తిరుపతి నియోజకవర్గంలో 10వేల మొక్కలు నాటనున్నారు. ఒక్కో డివిజన్‌కు 200మొక్కలు చొప్పున 50డివిజన్లలో నాటేందుకు సన్నద్ధమైనట్లు నియోజకవర్గ ఇన్‌చార్జి కిరణ్‌రాయల్, నగరాధ్యక్షుడు రాజారెడ్డి తెలిపారు. కానుగ, రావి, ఉసిరి, నేరేడు, వేప వంటి 10వేల మొక్కలు ఆదివారం తిరుపతికి చేరనున్నాయన్నారు. కొత్తరోడ్లు, పాఠశాలలు, ప్రభుత్వ భవనాలు, వైద్యశాలలు, సచివాలయాలు, బస్టాండు, అవకాశమున్న ప్రతి ఇంటి ముందు వీటిని నాటుతామన్నారు. ప్రతి జనసైనికుడు, పవన్‌కల్యాణ్ అభిమాని భాగస్వాములవ్వాలని కోరారు.

అమెరికన్ లేజర్ ఐ ఆస్పత్రి ప్రారంభం



తిరుపతి(వైద్యం), ఆగస్టు 31: అత్యాధునిక కంటి వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా అమెరికన్ లేజర్ ఐ ఆస్పత్రిని తిరుపతిలో ప్రారంభించినట్లు డైరెక్టర్ పార్థసారథి తెలిపారు. ఎయిర్ బైపాస్ రోడ్డులో శనివారం నూతన బ్రాంచిని ఆయన ప్రారంభించి, ప్రసంగించారు. తెలుగు రాష్ట్రాల్లో 23 బ్రాంచీలు కలిగి అత్యాధునిక కంటి వైద్య సేవలను ఎన్టీఆర్ వైద్యసేవ, ఈహెచ్‌ఎస్ లబ్ధిదారులతోపాటు బియ్యం కార్డు కలిగినవారికి కూడా ఉచితంగా వైద్య సేవలందిస్తామన్నారు. ముఖ్య అతిథిగా సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ హాజరయ్యారు. ఆస్పత్రి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అరుణ, డాక్టర్లు మాధవి, విష్ణువర్ధన్, హరీష్‌కుమార్, ప్రియాంక, సిబ్బంది శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రికార్డ్ అసిస్టెంట్‌కు వీడ్కోలు

తిరుపతి(విద్య), ఆగస్టు 31: సమాచార శాఖ రికార్డ్ అసిస్టెంట్ సుధాకర్ శనివారం రిటైరయ్యారు. ఆ శాఖ అధికారులు, సిబ్బంది ఆయన్ను సత్కరించి, వీడ్కోలు పలికారు. డీపీఆర్వో బాలకొండయ్య, విశ్రాంత అసిస్టెంట్ డైరెక్టర్లు చెంగల్‌రెడ్డి, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో తిరుపతిని ప్రథమ స్థానంలో నిలుపుదాం

కమిషనర్ మౌర్య

తిరుపతి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీల్లో తిరుపతిని ప్రథమ స్థానంలో నిలుపుదామని ప్రజలకు, అధికారులకు నగరపాలక సంస్థ కమిషనర్ నారపరెడ్డి మౌర్య పిలుపునిచ్చారు. శనివారం కార్పొరేషన్ కార్యాలయంలో ఈ పోటీలపై వివిధ విభాగాల అధికారులతో సమీక్షించారు. నగరపాలక సంస్థలో వందశాతం ఇంటింటి చెత్త సేకరణ జరుగుతోందన్నారు. నగరంలో ఎక్కడా భవన నిర్మాణ వ్యర్థాలు వేయకుండా చర్యలు తెయనుకోవాలన్నారు. ఈనెల 14వ తేదీనుంచి 15 రోజుల పాటు 'స్వచ్ఛతా హీ' సేవ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. డీసీ అమరయ్య, ఎస్ఈ మోహన్, ఎంఈలు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, ఎంహెచ్‌వో డాక్టర్ యువఅన్వేష్ రెడ్డి, డీసీపీ శ్రీనివాసులు రెడ్డి, డీఈలు సంజయ్ కుమార్, రాజు, శ్రావణి, నరేంద్ర, తేజస్విని, శానిటరీ సూపర్ వైజర్లు చెంచయ్య, సుమతి, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.


వినాయకసాగర్ వద్ద డ్రోన్లను పరిశీలిస్తున్న కమిషనర్ మౌర్య

దోమల నివారణకు డ్రోన్లతో మందుల పిచికారీ

తిరుపతి (జీవకోన): దోమల నివారణలో భాగంగా నీటికుంటల్లో లార్వాలను నాశనం చేయడానికి డ్రోన్లతో మందును పిచికారీ చేస్తున్నామని కమిషనర్ తెలిపారు. వినాయకసాగర్ వద్ద శనివారం ఈ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. మనుషులు వెళ్లలేని నీటికుంటలు, నిల్వ నీటి ప్రాంతాల్లో డ్రోన్ల సాయంతో లార్వాలను నాశనం చేయడం ద్వారా దోమలను నియంత్రించవచ్చన్నారు. అలాగే వినాయక విగ్రహాల నిమజ్జనానికి జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, మున్సిపల్ ఇంజనీర్ చంద్రశేఖర్, హెల్త్ ఆఫీసర్ తదితరులున్నారు.

రాజకీయాలకతీతంగా చవితి వేడుకలు

ఉత్సవ కమిటీ కార్యాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

తిరుపతి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రాజకీయాలకు అతీతంగా వినాయక చవితి వేడుకల్లో అందరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కోరారు. ఇందిరా మైదానంలోని ఇండోర్ స్టేడియంలో తిరుపతి వరసిద్ధి వినాయక మహోత్సవ కమిటీ కార్యాలయాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. వీధుల్లో విగ్రహాలు పెట్టే ఉత్సవ నిర్వాహకులు కమిటీ సహకారం తీసుకోవాలని సూచించారు. విగ్రహాల ఏర్పాటుకు అవసరమైన అన్ని అనుమతులను ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వం సింగల్ విండో విధానంలో ఇచ్చేందుకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేసిందని చెప్పారు. వినాయక విగ్రహాల నిమజ్జనంలో ఎటువంటి ఆటంకాలు లేకుండా జరిపేందుకు అధికార యంత్రాంగం పూర్తిగా సహకరిస్తుందన్నారు. కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాస్ మాట్లాడుతూ.. వినాయక చవితికి దాదాపు 800 విగ్రహాలను నగరంలో ఏర్పాటు చేయనున్నారని తెలిపారు. మేయర్ డాక్టర్ శిరీష, కమిటీ సభ్యులు భానుప్రకాష్ రెడ్డి, నవీన్ కుమార్ రెడ్డి, కొత్తపల్లి అజయ్ కుమార్, డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, ఊకా విజయ్ కుమార్, ఆర్సీ మునికృష్ణ, మహేష్ యాదవ్, రుద్రకోటి సదాశివం, గుండాల గోపీనాథ్ పాల్గొన్నారు.


ఉత్సవ కమిటీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే ఆరణి, కమిటీ సభ్యులు

సమన్వయంతో ఘనంగా నిర్వహిద్దాం : కమిషనర్

అన్నిశాఖల సమన్వయంతో గణేష్ ఉత్సవాలను ఘనంగా నిర్వహిద్దామని కమిషనర్ మౌర్య చెప్పారు. తుడా సమావేశ మందిరంలో శనివారం సాయంత్రం ఉత్సవ కమిటీ సభ్యులతో ఆమె సమావేశమయ్యారు. మట్టివినాయక విగ్రహాలను ఏర్పాటుచేసే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు.

ఏర్పేడు మీదుగానే బస్సులు నడపండి

తిరుపతి(ఆర్టీసీ), ఆగస్టు 31: శ్రీకాళహస్తి-తిరుపతి ఆర్టీసీ బస్సులు వయా ఏర్పేడు మీదుగానే నడపాలని ప్రజా రవాణాధికారి చెంగల్‌రెడ్డి ఆదేశించారు. శనివారం ఆయన సంబంధిత డిపో మేనేజర్లతో సమీక్షించారు. జాతీయ రహదారి కొంతమేరకు అందుబాటులోకి వచ్చిన తర్వాత కూడా బస్సులు ఏర్పేడులోకి రాకుండా వెళ్లిపోతున్నాయని ప్రయాణికుల నుంచి ఫిర్యాదులు అందాయన్నారు. ఈ క్రమంలో ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటుచేసి.. ఆకస్మిక తనిఖీలు చేయాలని, పట్టుబడిన బస్సు డ్రైవర్, కండక్టర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలిచ్చారు.

ఓఆర్ఐ వెబ్‌సైట్ ప్రారంభం


వెబ్‌సైట్‌ను ప్రారంభిస్తున్న అప్పారావు, భూపతినాయుడు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 31: ఎస్వీయూ ఓఆర్ఐ విభాగ వెబ్‌సైట్‌ను ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు ప్రారంభించారు. ఎస్వీయూఓఆర్ఐ.. పేరుతో గల వెబ్‌సైట్ ద్వారా తాళపత్రాలను సేకరించడం, డిజిటలైజేషన్ చేయడం, అందరికీ అందుబాటులో ఉంచడమే లక్ష్యమన్నారు. ఓఆర్ఐలో ఉన్నదంతా భారతీయ విజ్ఞాన సంపద అని, దీన్ని కాపాడుకోవడం, భావితరాలకు అందించడం చేస్తున్నామన్నారు. ఓఆర్ఐ డైరెక్టర్ ఆచార్య పీసీ వెంకటేశ్వర్లు, తెలుగు విభాగాధిపతి ఆచార్య ఆర్.రాజేశ్వరమ్మ, కంప్యూటర్ సెంటర్ ఆఫీసర్ డాక్టర్ ఫణిరమేష్, అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

గౌరవ డాక్టరేట్ ప్రదానం



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 31: సామాజిక సేవా రంగంలో కృషికి గుర్తింపుగా కర్ణాటకకు చెందిన ఏషియా ఇంటర్నేషనల్ కల్చరల్ అకాడమీ తిరుపతికి చెందిన సాకం కృష్ణమూర్తికి గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. హోసూరులో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన డాక్టరేట్‌ను స్వీకరించారు.

కేంద్ర, రాష్ట్ర పథకాలను సద్వినియోగం చేసుకోండి

తిరుపతి(విద్య), ఆగస్టు 31: రైతుల ఉత్పాదకతను పెంపొందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ప్రసాదరావు సూచించారు. నాబార్డు ఆధ్వర్యంలో జిల్లా వ్యవసాయాధికారి అధ్యక్షతన రైతు ఉత్పాదక సంఘాల జిల్లా స్థాయి సమావేశం కలెక్టరేట్‌లో శనివారం జరిగింది. ఉత్పాదక సంఘాల సభ్యులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. డీహెచ్‌వో రవి, ఏపీఎంఐపీ సతీష్, హార్టికల్చర్ అధికారి శివకుమారి, సెరీకల్చర్, ఫిషరీస్ జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్స్ రంగంలో మెరుగైన ఉద్యోగావకాశాలు

నానోచిప్ సొల్యూషన్ సీఈవో హరికృష్ణన్


బ్రోచర్‌ని ఆవిష్కరిస్తున్న హరికృష్ణన్, సుధాకర్‌రెడ్డి తదితరులు

తిరుపతిరూరల్, ఆగస్టు 31: ఎలక్ట్రానిక్స్ రంగంలో మెరుగైన ఉద్యోగావకాశాలు అందుబాటులోకి వస్తాయని బెంగళూరుకి చెందిన నానోచిప్ సొల్యూషన్ సంస్థ సీఈవో డాక్టర్ హరికృష్ణన్ తెలిపారు. కరకంబాడి రోడ్డులోని ఎస్వీకాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో ఈసీఈ విభాగ ఆధ్వర్యంలో న్యూఢిల్లీకి చెందిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్(డీఎస్ఐఆర్) ఆర్థిక సౌజన్యంతో చిప్‌డిజైన్-ఐవోటీ అప్లికేషన్స్ అనే అంశంపై శనివారం జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.సుధాకర్‌రెడ్డి, సెనారిట్ టెక్నాలజీస్ డైరెక్టర్ డాక్టర్ సిరిల్ ప్రసన్నరాజ్‌లతో కలసి హరికృష్ణన్ ప్రసంగించారు. పరిశోధకులు దాదాపు 60 పరిశోధనాపత్రాలను సమర్పించారు. డీన్లు అజాద్, ఈశ్వరరెడ్డి, సదస్సు కన్వీనర్ సి.చంద్రశేఖర్, వైస్‌ప్రిన్సిపాల్ తారకేశ్వర్, టీసీఎస్‌కి చెందిన సీనియర్ డిజైనర్ అర్జున్ హరినాగ్, తిరుపతి ఐఐటీ ప్రొఫెసర్ ఎన్ఎస్‌మూర్తి తదితరులు పాల్గొన్నారు.

రోగి ఆచూకీ కోసం రెండు పోలీసు బృందాలు

తిరుపతి(వైద్యం/నేరవిభాగం), ఆగస్టు 31: స్విమ్స్‌లో నాలుగు రోజుల కిందట కనిపించకుండా పోయిన టి.సీతారామప్ప ఆచూకీ శనివారం కూడా తెలియరాలేదని స్విమ్స్, పోలీసు అధికారులు పేర్కొన్నారు. సీతారామప్ప ఆచూకీ కోసం వెస్ట్ సీఐ రామకృష్ణ రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. అలాగే స్విమ్స్, రుయా ఆస్పత్రుల పరిసరాలను.. అలిపిరి, కపిలతీర్థం సమీపాల్లోనూ ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టినట్లు స్విమ్స్ అధికారులు తెలిపారు. నాలుగు రోజులుగా కనిపించకుండా పోయిన సీతారామప్ప మిస్టరీని ఛేదించడానికి ఇటు పోలీసులు, అటు టీటీడీ విజిలెన్స్ సిబ్బంది గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. అయినప్పటికీ రోగి ఆచూకీ తెలియకపోవడం పలు అనుమానాలకు తావిస్తుందని బాధితులు పేర్కొంటున్నారు. మరోవైపు తండ్రి సీతారామప్ప కోసం కుమారుడు విశ్వనాథ్ శనివారం కూడా బంధుమిత్రులతో కలిసి తిరుపతి పరిసరాల్లో గాలించాడు. ఫలితం లేక పోవడంతో తమ గ్రామ పరిసరాల్లో వెతికేందుకు బూరగమాకులపల్లెకు బయల్దేరి వెళ్లాడు.

చట్టాలపై అవగాహన ఉండాలి


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ సంగమేశ్వరరావు

పెళ్లకూరు, ఆగస్టు 31: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని నాయుడుపేట సీఐ సంగమేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం మండలంలోని ముమ్మారెడ్డిగంటలో సివిల్ రైట్స్ డే నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యువత మత్తు పదార్థలకు బానిసలు కాకూడదని, గంజాయి తదితర మత్తు పదార్థాలను వాడితే కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. ప్రస్తుతం సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని, ప్రజలు వీటి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మహిళలపై అఘాత్యాలకు పాల్పడే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సురేష్‌బాబు, ఆర్ఐ సంతోషీబాయి, ఎస్ఐ శ్రీకాంత్, వీఆర్వో కళ్యాణి, సర్పంచు రాంబాబు, మారాబత్తిన గురవయ్య, చంద్ర, వెంకటేష్, రవి తదితరులు ఉన్నారు.

బాలకృష్ణ అభిమానుల సంబరాలు



నాయుడుపేట టౌన్, ఆగస్టు 31 : సినీరంగంలో ఎదురులేని నటుడు నందమూరి బాలకృష్ణ అని బాలకృష్ణ అభిమాన సంఘం డివిజన్ అధ్యక్షుడు కందల కృష్ణారెడ్డి అన్నారు. హిందూపురం ఎమ్మెల్యే, సినీహీరో నందమూరి బాలకృష్ణ సినీ పరిశ్రమలో 50 సంవత్సరాలు పూర్తి చేసుకోవడంతో శనివారం నాయుడుపేటలో కందల కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో కేక్‌కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. బాలకృష్ణ సినిమా రంగంలోనే కాకుండా ప్రజాసేవలో బసవతారక క్యాన్సర్ వైద్యశాల నెలకొల్పి తనవంతు సేవలు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో బాలకృష్ణ ఫ్యాన్స్ పాదర్తి ప్రకాష్‌నాయుడు, ప్రసాద్, బంగారుబాబు, రాజారెడ్డి, కృష్ణారెడ్డి, కృష్ణమూర్తి, రాజు, సిరాజ్, కిషోర్ పాల్గొన్నారు.

చెరువు కట్టకు మరమ్మతులు

ఓజిలి, ఆగస్టు 31 : గత ఏడాది తుపానుకు దెబ్బతిన్న ఓజిలి చెరువు (పెద్దచెరువు) కట్టకు మరమ్మతులు చేపట్టారు. చెరువు కట్ట మరమ్మతులకు ఫ్లడ్ డ్యామేజ్ రిపేర్లు (ఎఫ్‌డీఆర్) కింద టీడీపీ ప్రభుత్వం 9 లక్షల రూపాయలను మంజూరు చేసింది. ఈ నిధులతో చెరువు కట్టకు 400 మీటర్ల మేరకు జంగిల్ క్లియరెన్సు, గ్రావెలింగ్ పనులు చేపట్టేలా అధికారులు నిర్ణయించారు. కాగా మిగిలిన చెరువు కట్టకు కూడా వరద తాకిడి కారణంగా మరమ్మతులకులోనై ఉంది. ఈ క్రమంలో టీడీపీ నాయకుడు కంకణాల సత్యవరప్రసాద్‌రావు చెరువు కట్టకు మరమ్మతులు చేపట్టేందుకు నిర్ణయించారు. దీంతో చెరువు కట్ట మరమ్మతుల పనులు జరుగుతున్నాయి.

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత


మొక్కలు నాటుతున్న ఎంఈవో

డక్కిలి, ఆగస్టు 31 : పర్యావరణ పరిరక్షణను అందరూ బాధ్యతగా భావించి మొక్కలు నాటాలని ఎంఈవో జగదీష్‌బాబా అన్నారు. శనివారం ఆయన మండలంలోని కంథలవారిపల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించి మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం విద్యార్థుల విద్యాప్రమాణాలను తెలుసుకొన్నారు. మధ్యాహ్న భోజనం పథకాన్ని పరిశీలించారు. ఆయన వెంట పధానోపాధ్యాయులు ఉప్పళ పరళికుమారి. రత్నప్రభ తదితరులు వున్నారు

ఊనుగుంటపాళెంలో వనమహోత్సవం



కోట, ఆగస్టు 31 : మండల పరిధిలోని ఊనుగుంటపాళెం, రుద్రవరం గ్రామాల్లో శనివారం అంగన్‌వాడీల ఆధ్వర్యంలో వనమహోత్సవం జరిగింది. సీడీపీవో మునికుమారి, సూపర్‌వైజర్ కవిత ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లో రోడ్లకు ఇరువైపులా, అంగన్‌వాడీ కేంద్రాల ప్రాంగణాలలో మొక్కలు నాటి దత్తత తీసుకున్నారు. అనంతరం అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, అధికారుల ఆధ్వర్యంలో చెట్ల ప్రాముఖ్యతను తెలుపుతూ ర్యాలీ జరిగింది.

బాలాయపల్లిలో క్లీన్ ఆంధ్ర - గ్రీన్ ఆంధ్ర


మొక్కలు నాటుతున్న జనసేన నాయకులు, అధికారులు

బాలాయపల్లి, ఆగస్టు 31: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ పుట్టినరోజు వారోత్సవాల్లో భాగంగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు పగడాల వెంకటరమణయ్య ఆధ్వర్యంలో క్లీన్ ఆంధ్ర-గ్రీన్ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వినీల్‌కుమార్, జనసేన నాయకులు తోట కృష్ణయ్య, రామారావు అనిల్, అరవ రాజేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బూదూరు భూ సమస్యపై ప్రజాకోర్టు


ఇరు పక్షాల వాదనలు వింటున్న తహసీల్దార్

దొరవారి స త్రం, ఆగస్టు 31: మండల పరిధి లోని బూదూరు లో నెలకొన్న పట్టా భూముల సమస్య పై శనివారం తహసీ ల్దార్ శైలాకుమారి ప్రజాకోర్టు నిర్వహించారు. ఆ గ్రామంలోని 20 మంది రైతుల పట్టా భూములను వారి ప్రమేయం లేకుండా రియల్టర్ రవీంద్రనాయుడు అక్రమ రిజిస్ట్రేషన్ చేసుకొన్నారని ఫిర్యాదు మేరకు ప్రజాకోర్టు నిర్వహించారు. రైతులు, రియల్టర్ వాదనలను తహసీల్దార్ విన్నారు. ఇరుపక్షాల నడుమ వాగ్వాదం చోటు చేసుకోవడంతో పోలీసులు జోక్యం చేసుకొని ఇరుపక్షాలను శాంతింప చేశారు. రిజిస్ట్రేషన్లు తమ ప్రమే యం లేకుండా జరిగాయని రైతు ల వాదన. తాను నగదు ఇచ్చి కొనుగోలు చేసుకొని రిజిస్ట్రేషన్‌ను చేసుకొన్నానని రియల్టర్ తెలిపా రు. ఇరుపక్షాల వాదనలు రికార్డు చేసి తదుపరి నిర్ణయం తీసు కొం టామని తహసీల్దారు తెలిపారు.

దుకాణాల కేటాయింపు

డక్కిలి, ఆగస్టు 31 : డక్కిలి గ్రామ పంచాయతీకి చెందిన 5 దుకాణాలకు శనివారం స్థానిక సచివాలయ భవనంలో ఈవోపీఆర్డీ అల్లాభక్షు ఆధ్వర్యంలో వేలం పాటలు నిర్వహించారు. పాటలో దుకాణాలను సొంతం చేసుకొన్న వారు ప్రతి నెలా క్రమం తప్పకుండా అద్దె చెల్లించాలన్నారు. పాతబకాయిలు చెల్లించని వారిపై కేసులు పెడతామని అధికారులు స్పష్టం చేశారు.

చవితి ఉత్సవాలకు అనుమతి తప్పనిసరి

సూళ్లూరుపేట, ఆగస్టు 31: వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించే వారు ఆన్‌లైన్ ద్వారా అనుమతి తీసుకోవాలని ఎస్ఐ వి.బ్రహ్మానాయుడు సూచించారు. చవితి ఉత్సవాలకు ఈ ఏడాది ప్రభుత్వం కొత్తగా సింగిల్ విండో యాప్ తీసుకొచ్చిందని, దీని ద్వారా కమిటీ నిర్వాహకులు సులువుగా మొబైల్ యాప్ ద్వారానే అనుమతి తీసుకోవచ్చునన్నారు. గతంలో ఉత్సవాలు నిర్వహించేందుకు పోలీస్, విద్యుత్, రెవెన్యూ, మున్సిపల్ ఇలా అన్నిశాఖల అధికారుల వద్దకు తిరిగి అనుమతి తీసుకొనేవారు. ప్రస్తుతం అలా కాకుండా సింగిల్ విండో యాప్ ద్వారా కమిటీ నిర్వాహకులు రిజిస్ట్రేషన్ చేసుకొని అనుమతి తీసుకొంటే సరిపోతుందన్నారు.

లక్ష్మీనరసింహస్వామికి పూజలు

చిల్లకూరు, ఆగస్టు 31: మండలంలోని కలవకొండ గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఉదయం స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు, పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం జరిగింది. రాత్రికి స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పల్లకీసేవ నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో స్వామి, అమ్మవార్లను ఊరేగించారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని అన్నప్రసాదాలు స్వీకరించారు.

నారాయణ కళాశాలలో వైద్యశిబిరం

గూడూరు అర్బన్, ఆగస్టు 31: స్థానిక నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రవిప్రసాద్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆరోగ్యంపట్ల శ్రద్ధ వహించాలన్నారు. క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు చేయించుకుని జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ విజయ్‌కుమార్, విశ్వక్సేనా రెడ్డి, కోటేశ్వరరావు, సుధీర్ పాల్గొన్నారు.

ఎస్ఐ బాధ్యతల స్వీకరణ



బాలాయపల్లి, ఆగస్టు 31: బాలాయపల్లి నూతన ఎస్ఐగా కామినేని గోపి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న మహబూబ్ సుబానీ బదిలీపై పల్నాడు జిల్లాకు వెళ్లగా నాయుడుపేటలో పనిచేస్తున్న గోపి బాలాయపల్లికి నియమితులయ్యారు.

సిద్ధిపురంలో సివిల్ రైట్స్ డే

దొరవారిసత్రం, ఆగస్టు 31: మండలంలోని సిద్ధిపురం గిరిజన కాలనీలో శనివారం అధికారులు సివిల్ రైట్స్ డే నిర్వహించారు. తహసీల్దారు శైలాకుమారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పౌర హక్కుల గురించి గ్రామస్తులకు వివరించారు. భూ సమస్యలు, రేషన్ కార్డుల కొరత ఉంటే ప్రజలు నేరుగా తమ దృష్టికి తేవచ్చునని తహసీల్దారు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీటీ గోపినాథ్ రెడ్డి, ఎంపీడీవో కార్యాలయ ఏవో రఘురామయ్య, గృహనిర్మాణశాఖ ఏఈ మోహన్ పాల్గొన్నారు.

విద్యాకమిటీ ఎన్నిక మళ్లీ వాయిదా

కోట, ఆగస్టు 31 : కోట మండలం పెదగోవిందపల్లి ఉన్నత పాఠశాల విద్యాకమిటీ ఛైర్మన్ ఎన్నిక శనివారం కోరం లేక నాల్గవసారి వాయిదా పడింది. విద్యార్థుల తల్లిదండ్రులు ఏ వైపు వెళ్లి చేతులెత్తితే ఎక్కడ రాజకీయంగా ఇబ్బందులు వస్తాయోనని ఎన్నికలకు దూరంగా ఉంటూ వచ్చారు. ఎన్నికకు 50శాతం కూడా తల్లిదండ్రులు రాకపోవడంతో ఎంఈవో దారా మస్తానయ్య, హెచ్ఎం గిరిబాబు ఛైర్మన్ ఎన్నికను పూర్తిగా రద్దుచేస్తున్నట్లు ప్రకటించారు.

నెల్లూరుపల్లి కొత్తపాళెంలో పౌరహక్కుల దినోత్సవం

కోట, ఆగస్టు 31 : మండల పరిధిలోని నెల్లూరుపల్లి కొత్తపాళెం గిరిజన కాలనీలో శనివారం పౌరహక్కుల దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దారు జయ జయరావు, ఎంపీడీవో భవానీతోపాటు పలుశాఖల అధికారులు పౌరహక్కుల గురించి అవగాహన కల్పించారు. రాజ్యాంగపరంగా సంక్రమించిన హక్కులు, వాటి వినియోగం అనే అంశాలను వివరించారు. ఈ సమావేశంలో సర్పంచ్ ప్రసన్న, ఎంపీటీసీ నారాయణ, టీడీపీ నాయకులు నెల్లూరు మోహన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

వాకాడు ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ



వాకాడు, ఆగస్టు 31 : వాకాడు ఎంపీడీవోగా మనోహర్ గౌడ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. చిట్టమూరు మండలంలో ఈవోపీఆర్డీగా విధులు నిర్వహిస్తూ ఎంపీడీవోగా వాకాడుకు వచ్చారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేస్తున్న వెంకటేశ్వరరావు వలంటరీ రిటైర్డ్‌మెంట్ ఇవ్వడంతో ఈ పోస్టు ఖాళీ అయ్యింది. ఈ సందర్భంగా నూతన ఎంపీడీవో మనోహర్‌గౌడ్ మాట్లాడుతూ మండల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పెళ్లకూరు, ఆగస్టు 31 : అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్‌లను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. పుల్లూరు సమీపంలోని స్వర్ణముఖినది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను శనివారం రాత్రి పట్టుకుని విచారించారు. ఇసుక తరలింపునకు ఎలాంటి అనుమతి పత్రాలు లేవని గుర్తించినట్లు తెలిపారు. ఇద్దరు డ్రైవర్లను అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు.

తుడాలో ఇక ఐఏఎస్‌ల పాలన

వైసీపీ ప్రభుత్వంలో నాన్ ఐఏఎస్‌లతో ఇష్టారాజ్యం - కూటమి ప్రభుత్వంలో మళ్లీ పాత సంప్రదాయం

మున్సిపల్ కమిషనర్‌కు అదనపు బాధ్యతలు



తిరుపతి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా)లో ఇక ఐఏఎస్‌ల పాలన కొనసాగనుంది. 2019వరకు మున్సిపల్ కమిషనర్‌గా ఉన్న ఐఏఎస్ అధికారినే తుడా వీసీగా అదనపు బాధ్యతలు అప్పగించేవారు. దీంతో పాలనలో పారదర్శకత ఉండేది. అభివృద్ధి పనుల్లో తుడా-మున్సిపల్ కార్పొరేషన్ మధ్య చక్కని సమన్వయం కనిపించేది. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చాక అప్పటికే ఉన్న ఐఏఎస్ అధికారి కొన్ని వివాదాస్పదమైన ఫైల్స్‌పై సంతకం చేసేందుకు నిరాకరించినట్లు వార్తలొచ్చాయి. దీంతో ఐఏఎస్ అధికారిని తప్పించి నాన్-ఐఏఎస్ అధికార్లను నియమిస్తూ వచ్చారు. ఈనేపథ్యంలో తుడా నిధుల గోల్‌మాల్‌పై అనేక ఆరోపణలు వచ్చాయి. ఇటీవల మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ తుడాలో నిర్వహించిన సమీక్షలో సిబ్బంది జీతాలకే ఏడాదికి రూ.15కోట్లు వెచ్చించడంపై ఆశ్చర్యం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. తుడా ప్రక్షాళనలో భాగంగా పాత సంప్రదాయాన్నే ఎన్డీఏ కూటమి ప్రభుత్వం తెరపైకి తీసుకొచ్చింది. మున్సిపల్ కమిషనర్ నారపరెడ్డి మౌర్యకు పూర్తి స్థాయి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. ఆమేరకు శనివారం ఆమె తుడా వీసీగా బాధ్యతలు చేపట్టారు.

తుడా అభివృద్ధికి కృషి చేస్తా : మౌర్య

తుడా అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని వైస్ ఛైర్మన్ మౌర్య అన్నారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆమె మాట్లాడారు. నగరపాలక సంస్థ, తుడాల అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు. ఈమెకు ఇన్‌చార్జి వీసీగా పనిచేసిన వెంకట నారాయణతోపాటు నగరపాలక సంస్థ, తుడా అధికారులు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.

సెరికల్చర్ అధికారిణికి పదోన్నతి

తిరుపతి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): జిల్లా సెరికల్చర్ అధికారిగా పనిచేస్తున్న బి.గీతారాణి పదోన్నతిపై కాకినాడ జిల్లాకు బదిలీ అయ్యారు. సెరికల్చర్ శాఖలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఉన్న ఆమె ప్రస్తుతం తిరుపతి జిల్లా సెరికల్చర్ అధికారిగా పనిచేస్తున్నారు. 2023-24 పదోన్నతుల ప్యానెల్‌లో ఆమె పేరు చేర్చిన ప్రభుత్వం.. దానికనుగుణంగా డిప్యూటీ డైరెక్టర్‌గా పదోన్నతి కల్పించింది.ఆహోదాలో గీతారాణిని కాకినాడ జిల్లా సెరికల్చర్ అధికారిగా బదిలీచేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. అయితేఈ పదోన్నతి తాత్కాలిక ప్రాతిపదికన కల్పిస్తున్నట్టుగా ఉత్తర్వుల్లో పేర్కొంది.

రేపు ఉద్యోగులకు, పెన్షనర్లకు వేతనాలు, పెన్షన్లు

తిరుపతి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ఆగస్టు నెల వేతనాలు, పెన్షన్లు సోమవారం అందనున్నాయి. 31వ తేదీ నాల్గవ శనివారం కావడం, సెప్టెంబరు ఒకటి ఆదివారం కావడంతో బ్యాంకులకు సెలవులు వచ్చాయి. దాంతో వేతనాలు, పెన్షన్లు సోమవారం వారి బ్యాంకు ఖాతాలకు జమ కానున్నాయి. జిల్లాలో 30,101 మంది రెగ్యులర్ ఉద్యోగులు, 900 మంది టైమ్ స్కేల్ ఉద్యోగులు, 2400 మంది కాంట్రాక్టు ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరికి వేతనాల కింద ప్రభుత్వం నెలవారీ సుమారు రూ. 200 కోట్లు చెల్లిస్తోంది. అలాగే 17వేల మంది రిటైర్డు ఉద్యోగులున్నారు. వారికి నెలవారీ పెన్షన్ల కింద రూ.64 కోట్ల దాకా చెల్లిస్తోంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక వరుసగా మూడోనెల కూడా ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు వేతనాలు, పెన్షన్లు తొలి తేదీల్లోనే అందనున్నాయి. గతంలో వైసీపీ ప్రభుత్వంలో ఏ నెలా వీరికి జీతాలు, పెన్షన్లు తొలి రెండు వారాల్లో అందిన దాఖలాలు లేవు. అయితే గతానికి భిన్నంగా ఇపుడు జూలై నుంచి తొలి ఒకటి రెండు తేదీల్లోనే ఖాతాల్లో వేతనాలు, పెన్షన్లు జమ చేస్తుండడంతో ఉద్యోగులు, పెన్షనర్లు నిశ్చింతగా ఉంటున్నారు.

రేషన్‌కార్డుదారులకు తీపి కబురు

ఈనెల కోటాలోనే ఒక్కో కార్డుకు అరకిలో చక్కెర పంపిణీ

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 31: రేషన్ కార్డుదారులకు కూటమి ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఈనెల కోటాలో ఒక్కో కార్డుకు అరకిలో చక్కెర పంపిణీ చేసేలా ఆదేశాలు జారీ అయ్యాయి. జిల్లాలో 5,61,453 రేషన్ కార్డులున్నాయి. వీటి ద్వారా ప్రతి నెలా ఒక్కో మనిషికి ఐదు కిలోల లెక్కన బియ్యం ఉచితంగా అందజేస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలోని కార్డులకు అనుగుణంగా చక్కెర పంపిణీ చేయడానికి అన్ని చర్యలు చేపట్టారు. ఒక్కో కార్డుకు అరకిలో రూ.17 లెక్కన అందజేస్తామని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రాజా రఘువీరా తెలిపారు. ఎక్కడైనా చక్కెర పంపిణీ చేయకుంటే వెంటనే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. అంత్యోదయ అన్నయోజన కార్డులున్న వారికైతే కిలో చక్కెర అందచేస్తారు. వీటితో పాటు రాగులు అవసరమైన వారికి పంపిణీ చేయడానికి అధికారులు సిద్ధం చేస్తున్నారు. కానీ రాగులు ఎవ్వరూ అడగడంలేదని దీంతో కేవలం రెండు, మూడు టన్నులు మాత్రమే తెప్పిస్తున్నామని పేర్కొన్నారు.

అక్టోబరు నుంచి గోధుమ పిండి, కందిపప్పు

అక్టోబరు నుంచి రేషన్ కార్డుదారులకు బియ్యం, చక్కెరతో పాటు కందిపప్పు, గోధుమపిండి పంపిణీ చేయనున్నారు. జిల్లాకు 595 టన్నుల కందిపప్పు, మరో 595 టన్నుల గోధుమలు అవసరం ఉందని జిల్లా అధికారులు ప్రతిపాదనలు సిద్ధంచేసి ప్రభుత్వానికి పంపారు. త్వరలోనే చిరు ధాన్యాలను రైతుల నుంచి నేరుగా కొనుగోలు చేసి రేషన్ షాపుల ద్వారా పంపిణీకి సిద్ధం చేస్తున్నట్లు జిల్లా అధికారి ఒకరు తెలిపారు.

టూరిజం నకిలీ దర్శన టికెట్ల కేసులో మరో ఇద్దరి అరెస్ట్


సీఐ అదుపులో నారాయణ, అరసు

తిరుమల, ఆగస్టు31(ఆంధ్రజ్యోతి): టూరిజం నకిలీ దర్శన టికెట్ల కేసు వ్యవహారంలో తిరుమల పోలీసులు మరో ఇద్దరిని అరెస్ట్ చేశారు. ఏపీ టూరిజం పేరిట ఉన్న నకిలీ దర్శన టికెట్లతో ఓ ముఠా సాగించిన అక్రమాలు ఆగస్టు20వ తేదీన వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. చెన్నైకి చెందిన ఎంపైర్ ట్రావెల్స్ సంస్థ నిర్వాహకులతో కుమ్మక్కై, నకిలీ టికెట్లను స్కాన్ చేస్తున్నట్టు నటించి భక్తులను అనుమతిస్తున్న అక్రమం కలకలం సృష్టించింది. ఈ కేసులో కాంట్రాక్ట్ ఉద్యోగి రుద్రసాగర్‌తో పాటు కేవీఎస్ సంస్థలో పనిచేసిన మాజీ ఉద్యోగి నవీన్, ట్రావెల్స్‌కు చెందిన పెరియస్వామిని విజిలెన్స్ ఫిర్యాదుతో పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం ఈ కేసులో ఎవరెవరున్నారు, వీరికి టీటీడీ ఉద్యోగులు ఏమైనా సహకరించారా అనే అంశాలపై టూటౌన్ సీఐ సత్యనారాయణ విచారణ జరిపారు.కేవీఎం సంస్థలో గతంలో పనిచేసిన నారాయణ పాత ఏపీ టూరిజం టికెట్లను ఎంపైర్ ట్రావెల్స్ ఉద్యోగి అరసుకు పంపగా రూ.15 వేలకు మోహన్‌రాజు అనే వ్యక్తికి విక్రయించి తిరుమలకు పంపినట్టు పోలీసుల విచారణలో తేలింది. దీంతో నారాయణతో పాటు అరసును అరెస్ట్ చేసి వారి సెల్‌ఫోన్లను సీజ్ చేశారు. వారి బ్యాంకు ఖాతాలను పరిశీలించడంతో పాటు వారికి ఎవరెవరితో సంబంధాలున్నాయనే అంశాలపై దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి కేరాఫ్ చంద్రబాబు : ఎమ్మెల్యే విజయశ్రీ


పింఛన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

పెళ్లకూరు, ఆగస్టు 31 : రాష్ట్రాభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు కేరాఫ్‌గా నిలుస్తున్నారని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ పేర్కొన్నారు. శనివారం మండలంలోని దిగువ చావాలిలో ఏర్పాటు చేసిన సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, ఏఎంసీ మాజీ ఛైర్మన్ విజయభాస్కర్‌రెడ్డితో కలసి ఆమె పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రబాబునాయుడు రాష్ట్రాభివృద్ధితో పాటు ప్రజా సంక్షేమాన్ని సాధించేందుకు కృషి చేస్తున్నారన్నారు. తహసీల్దార్ ద్వారకానాథ్‌రెడ్డి, ఎంపీడీవో సురేష్‌బాబు, టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి దేవారెడ్డి నాగేంద్రప్రసాద్ రెడ్డి, సర్పంచు శ్రీపతి ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట : ఉద్యోగస్తుల జీతాల వలే పింఛన్‌దారులకు వారి ఇంటి వద్దకే ఎన్డీఏ ప్రభుత్వం పింఛన్లు అందజేస్తుందని ఎమ్మెల్యే విజయశ్రీ అన్నారు. నాయుడుపేటలో శనివారం వివిధ రకాల పింఛన్లను అందజేశారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సూచనల మేరకు నియోజకవర్గంలో పొలాలకు వెళ్లే దారులకు, శ్మశానవాటికలకు వెళ్లే దారులకు దాదాపు 140 కోట్ల రూపాయల ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపామన్నారు. వైస్ ఛైర్మన్ రఫీ, నెలవల రాజేష్, మైలారి శోభారాణి, రాజశేఖర్, శోభన్‌నాయుడు, మొండెం బాబు, నానాబాల సుబ్బారావు, నారాయణ తదితరులు ఉన్నారు.

సూళ్లూరుపేట : మున్సిపాలిటీ, మండలంలోని అన్ని గ్రామాల్లో సచివాలయ సిబ్బంది, టీడీపీ నాయకులు ఇంటింటికెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. ఆయా గ్రామాల్లో, వార్డుల్లో సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా పింఛన్లను అందజేశారు. పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఏ.రమేష్, ఏజీ కిషోర్, పార్టీ నాయకులు, వి.రమేష్, తిరుమలరావు, కృష్ణయ్య, తిరుపాల్, వెంకటేశ్వర్లు, పి.వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓజిలి : ఓజిలి మండలం మనవాలిలో ఎమ్మెల్యే విజయశ్రీ పింఛన్లు పంపిణీ చేశారు. మండల టీడీపీ కన్వీనరు విజయకుమార్‌నాయుడు, కుందాం సొసైటీ మాజీ అధ్యక్షుడు కనుమూరు గోపాల్‌రెడ్డి, ఓజిలి బీసీ సెల్ అధ్యక్షుడు వంకాయల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కలవకొండలో రక్తదాన శిబిరం

చిల్లకూరు, ఆగస్టు 31: కలవకొండ గ్రామంలోని క్రీడామైదానంలో శనివారం డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ పుట్టినరోజు వారోత్సవాల్లో భాగంగా జనసేన నాయకులు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జనసేన ఉమ్మడి నెల్లూరుజిల్లా ఉపాధ్యక్షుడు తీగల చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రజలు అపోహలు వీడి స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని కోరారు. అనంతరం రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. అదేవిధంగా వనమహోత్సవంలో భాగంగా క్రీడామైదానంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సుధబూర్, వెంకటేష్, మనోజ్, మోహన్, సునీల్, కుమార్, మహేష్, మధు, సుబ్రమణ్యం, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ ప్రమాదకరం : మాజీ ఎంపీ చింతా


మాట్లాడుతున్న మాజీ ఎంపీ చింతా మోహన్

గూడూరు, ఆగస్టు 31: ఎస్సీ వర్గీకరణ చేపట్టడం దేశానికే ప్రమాదకరమని మాజీ ఎంపీ చింతామోహన్ అన్నారు. శనివారం టవర్‌క్లాక్ వద్ద కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణపై కుట్ర పన్నుతున్నాయన్నారు. టీటీడీలో వీఐపీ బ్రేక్ దర్శనాల టిక్కెట్లను కొంతమంది దళారులు బ్లాక్‌లో అమ్ముకోవడం దారుణమైన విషయమన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు మూడు నెలల పరిపాలనలో చేపట్టింది ఏమీ లేదన్నారు. దుగ్గరాజపట్నం ఓడరేవు నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో రామకృష్ణారావు, నాగభూషణం, తాజుద్దీన్ పాల్గొన్నారు.

నాయుడుపేట : విభజించు, పాలించు అన్న బ్రిటీష్ పాలనపంథాలో నేడు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని మాజీ ఎంపీ చింతామోహన్ అన్నారు. నాయుడుపేట అంబేడ్కర్ విగ్రహం వద్ద శనివారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. దళితులు, బహుజనులు ఐక్యత ద్వారా రాజ్యాధికారాన్ని పొందుగలుగుతారని గ్రహించిన ఈ ప్రభుత్వాలు వాటిని విభజించే దిశగా పనిచేస్తున్నాయన్నారు. కాంగ్రెస్ నాయకులు గాడి వెంకటయ్య, నాగూర్‌బాబు తదితరులు ఉన్నారు.

కాలుష్యం నుంచి కాపాడండి

కోట, ఆగస్టు 31 : కోట పట్టణంలోని దాదారాయిగుంట సమీపంలో ఉన్న అటుకుల మిల్లు కాలుష్యం నుంచి కాపాడాలంటూ శనివారం స్థానికులు తహసీల్దారు జయజయరావుకు ఫిర్యాదు చేశారు. బయటప్రాంతాలకు చెందిన వ్యక్తులు ఇక్కడ అటుకుల మిల్లు నిర్వహిస్తున్నారన్నారు. రాత్రంబవళ్లూ మిల్లు యాజమాన్యం అటుకుల దంపకాలు చేస్తున్నారన్నారు. దీనివల్ల మిల్లు నుంచి వచ్చే పొగ నివాస గృహాలలోకి వచ్చి తీవ్ర అసౌకర్యానికి గురిచేస్తోందన్నారు. తక్షణం స్పందించి ఈ అటుకుల మిల్లును మూసివేయించాలని స్థానికులు తహసీల్దారును కోరారు.

వీహెచ్‌పీ షష్ట్యాబ్ది ఉత్సవాలు


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వీహెచ్‌పీ నాయకులు

సూళ్లూరుపేట, ఆగస్టు31: సూళ్లూరుపేటలో విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) షష్ట్యాబ్ది ఉత్సవాలను శనివారం స్థానిక సత్యసాయి మందిరంలో ఘనంగా నిర్వహించారు. విశ్వహిందూ స్థాపించి 60 సంవత్సరాలు పూర్తిచేసుకొన్న సందర్భంగా దేశవ్యాప్తంగా షష్ట్యాబ్ది ఉత్సవాలు జరుగుతున్నాయి. అందులో భాగంగా తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం మండలాల ప్రఖండ స్థాయిలో షష్ట్యాబ్ది ఉత్సవ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మల్లెమాల మురళీరెడ్డి, ఉపాధ్యక్షుడు కమ్మిరెడ్డి, మహిళా ఉపాధ్యక్షురాలు సుంకర ప్రతిమ పాల్గొన్నారు.

ఆదిమూలం ఏకపక్ష వైఖరితో టీడీపీకి నష్టం


బాలరాజు

సత్యవేడు, ఆగస్టు 31: ఎమ్మెల్యే ఆదిమూలం ఏకపక్ష వైఖరితో టీడీపీకి నష్టం కలుగుతోందని సత్యవేడు మండలం పీవీపురానికి చెందిన పార్టీ రాష్ట్ర వాణిజ్య విభాగం ఉపాధ్యక్షుడు కొండూరు బాలరాజు ఆరోపించారు. ఎమ్మెల్యేను విమర్శిస్తూ ఆయన సెల్ఫీ వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఆదిమూలం వైసీపీ వారికే అధిక ప్రాధాన్యతనిస్తూ, టీడీపీ విజయానికి కష్టపడిన నిజమైన కార్యకర్తలను, నాయకులను పక్కన పెడుతున్నారని వాపోయారు. వైసీపీకి చెందిన దామోదర రెడ్డి, ఆరణి విద్యానాథరెడ్డిలకు అన్ని విషయాల్లో మద్దతిస్తూ టీడీపీ నాయకులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. కేవీబీపురానికి చెందిన మరో వైసీపీ నేత సుబ్బారెడ్డి అలియాస్ రాధాకృష్ణరెడ్డి ఎమ్మెల్యే పేరు చెప్పుకుని దందాలకు పాల్పడుతున్నారని ఆరోపణలు గుప్పించారు. పొత్తుధర్మం పాటించకుండా జనసేన, బీజేపీ నాయకులను విస్మరించడం బాధాకరమన్నారు. కాగా బాలరాజు ఆరోపణలను సత్యవేడు మండల టీడీపీ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు పరమశివం ఒక ప్రకటనలో ఖండించారు. సమస్యలుంటే పార్టీ పెద్దల దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించుకోవాలని సూచించారు.

ఉచిత న్యాయసేవలను సద్వినియోగం చేసుకోండి



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న కృష్ణప్రియ

శ్రీకాళహస్తి, ఆగస్టు 31: చట్టాలపై అవగాహన పెంపొందించుకుని ఉచిత న్యాయసేవలను సద్వినియోగం చేసుకోవాలని శ్రీకాళహస్తి జూనియర్ సివిల్ జడ్జి కృష్ణప్రియ అన్నారు. శనివారం శ్రీకాళహస్తి పట్టణంలోని ఉపకారాగారాన్ని న్యాయమూర్తి తనిఖీ చేశారు. జైలులో మౌలిక వసతులు, పారిశుధ్య నిర్వహణ, ఆహార నాణ్యతపై ఆరా తీశారు. అనంతరం చట్టాలపై అవగాహన కల్పించారు. బెయిల్‌కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఉన్న అవకాశాలను వివరించారు. కార్యక్రమంలో జైలు అధికారులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా శని త్రయోదశి పూజలు

నాగలాపురం, ఆగస్టు 31: నాగలాపురం మండల పరిధిలోని సురుటుపల్లెలో వెలసిన పళ్లికొండేశ్వరాలయంలో శనివారం శని త్రయోదశి పూజలు వైభవంగా జరిగాయి. ఉదయం ఆలయంలో ప్రధాన అర్చకులు కార్తికేశన్ గురుక్కుల్ ఆధ్వర్యంలో పరివార దేవతలకు అభిషేకాలు చేసి, ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం వివిధ రకాల పుష్పాలతో పుష్పాలంకరణ చేసి మహాహారతి చేపట్టారు. పూజల అనంతరం ఉత్సవ మూర్తులైన మరగదాంబిక సమేత వాల్మీకేశ్వర స్వామికి ఆలయ ఆవరణలో ప్రాకారోత్సవం నిర్వహించారు.

సత్యవేడు: స్థానిక కల్యాణ వీరభద్రస్వామి ఆలయంలో శనిత్రయోదశి పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త రవికుమార్ ఆధ్వర్యంలో పూజారి మల్లికార్జున్ త్రయోదశి క్రతువును పూర్తి చేశారు. స్వామి వారికి వివిధ రకాల పుష్పాలు, జల, క్షీరాలతో అభిషేకాలు నిర్వహించి, ధూపదీప నైవేద్యాలను సమర్పించారు.

శాస్త్రీయ ఆలోచనల పట్ల విద్యార్థులు ఆసక్తి పెంచుకోవాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జనవిజ్ఞానవేదిక సభ్యులు, ఉపాధ్యాయులు

రేణిగుంట, ఆగస్టు 31: శాస్త్రీయ ఆలోచన పట్ల విద్యార్థులు ఆసక్తి పెంచుకోవాలని జనవిజ్ఞాన వేదిక సభ్యులు అన్నారు. శనివారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో కలిసి చెకుముకి పోటీల పోస్టర్లను ఆవిష్కరించారు. జనవిజ్ఞాన వేదిక మండల కార్యదర్శి కుప్పస్వామి మాట్లాడుతూ ఈనెల 25న పాఠశాల స్థాయిలో, అక్టోబరు 1న మండల స్థాయి, అక్టోబరు 27 జిల్లాస్థాయిలో, నవంబరు 9,10 తేదీల్లో రాష్ట్రస్థాయిలో చెకుముకి పోటీలు జరుగుతామని తెలిపారు. కార్యక్రమంలో జన విజ్ఞానవేదిక సభ్యులు, ప్రధానోపాధ్యాయురాలు విష్ణువర్ధనం, ఉపాధ్యా యులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం

బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 31: సూళ్లూరుపేట - బుచ్చినాయుడు కండ్రిగ రహదారి మరమ్మతులు పనులు చేపట్టారు. మట్టితోలి మమ అనిపించారు శీర్షికన ఆంధ్రజ్యోతిలో శుక్రవారం ప్రచురితమైన కథనానికి కాంట్రాక్టర్ స్పందించారు. మండలంలోని గాజులపెళ్లూరు సమీపంలో రోడ్డు మరమ్మతులు పనులు చేపట్టారు. గాజులపెళ్లూరు నుంచి బీఎస్‌కండ్రిగ వరకు రోడ్డుకు ఇరువైపులా మట్టితోలి ఎక్సకవేటర్‌తో చదును చేస్తున్నారు.

పంచాయతీలకు నిధుల విడుదలపై హర్షం

బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 31: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పంచాయతీల అభివృద్ధికి రూ.2600 కోట్లు విడుదల చేయడం పట్ల ఏపీ పంచాయతీరాజ్ ఛాంబర్ సెక్రటరీ పామంజి సుబ్రహ్మణ్యం హర్షం వ్యక్తం చేశారు. శనివారం అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.



చంద్రబాబుతో సుబ్రహ్మణ్యం

నేడు ప్రజాచైతన్య జానపద కళా ఉత్సవాలు

శ్రీకాళహస్తి, ఆగస్టు 31: శ్రీకాళహస్తి పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం ప్రజా చైతన్య జానపద కళా ఉత్సవాలు జరగనున్నట్లు ప్రజానాట్య మండలి రాష్ట్రప్రధాన కార్యదర్శి చిన్నం పెంచులయ్య, జిల్లా కార్యదర్శి నాగరాజు తెలిపారు. ప్రతి గ్రామం నుంచి కళాకారులు పెద్దసంఖ్యలో తరలిరావాలని వారు కోరారు.

ముళ్లపొదలను తొలగించండి

వరదయ్యపాళెం, ఆగస్టు 31: వరదయ్యపాళెం నుంచి సీఎల్ ఎన్‌పల్లె పంచాయతీ మీదుగా సంతవేలూరుకు వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా ముళ్ల పొదలు చొచ్చుకు వచ్చేశాయి. దీంతో వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సీసీఎల్ పరిశ్రమ, సూళ్లూరుపేటకు వెళ్లే ఆటోలు, బస్సులు, రైతులు ధాన్యం తరలించే వాహనాలు ఈ మార్గంలోనే వెళుతుంటాయి. ముళ్లపొదలు రోడ్డుపైకి చొచ్చుకు రావడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా ముళ్లపొదలను తొలగించాలని కోరుతున్నారు.



రోడ్డుపైకి చొచ్చుకువచ్చిన ముళ్లపొదలు

శ్రీకాళహస్తి సత్యవేడు

చట్టాలపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దారు

వరదయ్యపాళెం, ఆగస్టు 31: చట్టాలపై గిరిజనులు అవగాహన కలిగి ఉండి సామాజికంగా, ఆర్థికంగా పురోగతి సాధించాలని తహసీల్దారు రాజశేఖర్ అన్నారు. శనివారం పౌర హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని బీజీఆర్ ఎస్టీకాలనీలో గిరిజనులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఎస్ఐ మాట్లాడుతూ గిరిజనుల హక్కులకు ఎవరైనా భంగం కలిగించినా... అన్యాయం జరిగినా ఎలాంటి తమను సంప్రదిస్తే న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో నాగేంద్ర, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ కృష్ణ, విజయకుమార్ పాల్గొన్నారు.

శనీశ్వరస్వామికి తైలాభిషేకం

శ్రీకాళహస్తి, ఆగస్టు 31: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన శనీశ్వరస్వామికి శనివారం ఆగమోక్తంగా పూజలు నిర్వహించారు. స్వామి అమ్మవార్ల అభిషేకం అనంతరం శనీశ్వర స్వామి సన్నిధిలో కలశ ప్రతిష్ఠ చేసి మొదట గణపతి పూజ, కలశపూజ చేశారు. స్వామివారికి నువ్వుల నూనె, మంచి నూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళం, కలశ జలాలతో అభిషేకం చేశారు. స్వామివారిని పలు పుష్పాలతో అలంకరించి పూజలు చేసి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకారంలో శనీశ్వరస్వామి

ఆర్ఐ వేణుగోపాల్‌కు సన్మానం

వరదయ్యపాళెం, ఆగస్టు 31: వరదయ్యపాళెం తహసీల్దారు కార్యాలయంలో ఆర్ఐగా పనిచేస్తున్న వేణుగోపాల్‌కు శనివారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆయనను రెవెన్యూ సిబ్బంది సత్కరించారు.

అభివృద్ధి స్వాప్నికుడు చంద్రబాబు: ఆదిమూలం



వీఆర్ కండ్రిగలో పింఛను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

సత్యవేడు, ఆగస్టు 31: రాష్ట్రాభివృద్ధి కోసం అనుక్షణం పరితపించే అభివృద్ధి స్వాప్నికుడు ముఖ్యమంత్రి చంద్రబాబు అని సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం పేర్కొన్నారు. శనివారం సత్యవేడు మండలం వీఆర్ కండ్రిగలో లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. పింఛన్ల పంపిణీలో ఒక్కరోజులోనే 90 శాతానికి పైగా పంపిణీ చేయడం చంద్రబాబు పరిపాలన దక్షతకు నిదర్శనమన్నారు. గ్రామంలో శ్మశానికి దారి సౌకర్యం కల్పించాలని అరుందతివాడవాసులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు. సమస్యను పరిష్కరించాలని ఆర్ఐ సురేష్‌ను ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, ఎంఈవో రవి, ఎస్ఐ రామస్వామి, సర్పంచు సుజాత, సెక్రటరీ యుగంధర్, నాయకులు పరమశివం, మస్తాన్, రోశయ్య, సుబ్రహ్మణ్యం రాజు, చికెన్ చిన్న, బాలమురళి, శశి, అరుల్‌నాథం, ప్రభాకరరెడ్డి, మోహన్, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి: పట్టణంలోని బహదూరుపేట గాండ్లవీధిలో టీడీపీ పట్టణాధ్యక్షుడు విజయకుమార్ అధికారులతో కలిసి శనివారం లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1వ తేదీ ఆదివారం కావడంతో శనివారం ఉదయం నుంచే అధికారులు, నాయకులు పింఛన్లు అందజేయడం సంతోషకరమన్నారు. అలాగే తొట్టంబేడు మండలం కొణతనేరి, ఇలగనూరు పంచాయతీల్లో టీడీపీ మండలాధ్యక్షుడు గాలి మురళీ నాయుడు ఆధ్వర్యంలో పింఛన్లు అందజేశారు. సచివాలయ సిబ్బంది పల్లవి, ఆరీఫ్, మాజీ సర్పంచు మధు నాయుడు, కస్తూరయ్య తదితరులు పాల్గొన్నారు.

కేవీబీపురం: మండలంలోని రాజులకండ్రిగలో టీడీపీ మండలాధ్యక్షుడు రామాంజులునాయుడు, కళత్తూరులో తెలుగు రైతు అధ్యక్షుడు గోపీనాథ్‌రెడ్డి, తిమ్మసముద్రంలో సర్పంచు దొరబాబు నాయుడు, ఓళూరులో సురేష్, వగత్తూరులో సురేష్‌రెడ్డి సచివాలయ సిబ్బందితో కలిసి పింఛన్లు పంపిణీ చేశారు.

ఏర్పేడు: మండలంలోని మన్నసముద్రం గ్రామంలో ఎంపీడీవో గిడయ్య, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురవారెడ్డి ఆధ్వర్యంలో పింఛన్లను పంపిణీ చేశారు. టీడీపీ సీనియర్ నేతలు శివశంకర్‌రెడ్డి, మహేష్‌రెడ్డి, శివాజీరెడ్డి, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. వికృతమాల గ్రామానికి చెందిన మాధవ రెడ్డి అనారోగ్యంతో తిరుపతిలోని బర్డ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఏఎన్ఎం నిర్మల ఆస్పత్రికి వెళ్లి పింఛను అందజేశారు.

పిచ్చాటూరు: మండలంలోని 97 శాతం మంది లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో రాధారాణి తెలిపారు.

రేణిగుంట: మండలంలోని 92శాతం పింఛన్లు పంపిణీ చేశారు. ఉదయం నుంచే ఆయా పంచాయతీల్లోని సచివాలయ సిబ్బంది, పంచాయతీ అధికారులు టీడీపీ నాయకులతో కలిసి 8,470 మంది లబ్ధిదారులకు అందజేశారు.

సత్ప్రవర్తనతో మంచి భవిష్యత్తు



విద్యార్థులతో మాట్లాడుతున్న సీఐ గోపి

శ్రీకాళహస్తి, ఆగస్టు 31: సత్ప్రవర్తనతో మంచి భవిష్యత్తు ఉంటుందని సీఐ గోపి అన్నారు. పట్టణంలోని విక్రమ్ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మాదక ద్రవ్యాలు వినియోగించడం వల్ల భవిష్యత్తు అంధకారం అవుతుందని తెలిపారు. అలాగే మహిళలపై జరుగుతున్న నేరాలు అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఇక సైబర్ నేరాలు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదుకోవాలని ఎమ్మెల్యేకు వినతి

వరదయ్యపాళెం, ఆగస్టు 31: తమను ఆదుకోవాలని బత్తలవల్లం గ్రామస్తులు సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలాన్ని కోరారు. శనివారం వారు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంను కలిసి వినతిపత్రం అందజేశారు. తమ పెద్దల నుంచి సాగుచేసుకుంటున్న భూమిని అటవీశాఖ అధికారులు ఆక్రమించడం సరికాదని తెలిపారు. భూమిని నమ్ముకుని జీవిస్తున్న తమకు న్యాయం చేయాలని కోరారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి న్యాయం జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ముక్కంటి ఆలయాన్ని దర్శించుకున్న కబడ్డీ జట్టు



శ్రీకాళహస్తి, ఆగస్టు 31: ముక్కంటి ఆలయాన్ని బెంగళూరు ప్రొ కబడ్డీ జట్టు సభ్యులు శనివారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేద పండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



శ్రీకాళహస్తి, ఆగస్టు 31: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన అభయ వెంకటేశ్వరస్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో వివిధ రకాల అభిషేకాలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా నగలు, పుష్పాలతో సుందరంగా అలంకరించారు. ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ వేదపండితులు వారికి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే మధు, ఆయన సోదరుడిపై విచారణ చేపట్టండి



సమావేశంలో మాట్లాడుతున్న గురవారెడ్డి

ఏర్పేడు, ఆగస్టు 31: శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదనరెడ్డి, ఆయన సోదరుడు కిషోర్‌రెడ్డి అక్రమాలపై అధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురవారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఏర్పేడులో స్థానిక టీడీపీ నేతలతో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో అప్పటి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదనరెడ్డి, ఆయన సోదరుడు కిషోర్‌రెడ్డి నేతృత్వంలో అనేక భూకబ్జాలు జరిగాయన్నారు. అలాగే దౌర్జన్యాలు, దాడులు, అక్రమ కేసులు పెట్టి ఎంతో మందిని వేధించారని చెప్పారు. ప్రభుత్వం మారడంతో బాధితులంతా తమకు జరిగిన అన్యాయాలను వెల్లడిస్తున్నారని అన్నారు. శనివారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'వైసీపీ నేత కనుసన్నలో భూమి పేరు మార్పు' వచ్చిన కథనమే ఇందుకు నిదర్శనమన్నారు. సదాశివపురం గ్రామానికి చెందిన సుబ్బరాజు కుమారుడు సురేంద్రరాజు భూమిని ఆన్‌లైన్‌లో మార్పుచేయడం దారుణమన్నారు. ఇందుకు కారకులైన మాజీ ఎమ్మెల్యే మధు, వైసీపీ ఏర్పేడు మండల ఇన్‌చార్జి కిషోర్‌రెడ్డిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు గాలి కృష్ణవేణి, నాగేశ్వరరావు, గుణయాదవ్, మునెయ్య, రమణ, బాలాజీ, సదాశంకర్ పాల్గొన్నారు.

సురేంద్రరాజుకు న్యాయం చేస్తాం

సదాశివపురం గ్రామానికి చెందిన రైతు సురేంద్రరాజు రికార్డులను పరిశీలించి న్యాయం చేస్తామని తహసీల్దారు భార్గవి హామీ ఇచ్చారు. 'వైసీపీ నేత కనుసన్నలో నా భూమి మార్పు' శీర్షికన ఆంధ్రజ్యోతిలో వార్త ప్రచురితం కావడంతో తహసీల్దారు స్పందించారు. సదాశివపురానికి వెళ్లి గ్రామస్తులను విచారించి సురేంద్రరాజుకు న్యాయం చేయాలని ఆర్ఐ నల్లయ్యను ఆదేశించారు.

ఏర్పేడు మీదుగానే బస్సులు నడపండి

ఏర్పేడు, ఆగస్టు 31: నెల్లూరు, శ్రీకాళహస్తి నుంచి తిరుపతి వెళ్లే బస్సులు ఏర్పేడు మీదుగా నడపాలని జిల్లా ప్రజా రవాణాశాఖ అధికారి తిమ్మాడి చెంగల్‌రెడ్డి స్పష్టం చేశారు. అలా కాకుండా నిబంధనలకు విరుద్ధంగా బైపాస్‌లో వెళ్లిన ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్ల మీద కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వాహన తనిఖీలు

బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 31: మండల కేంద్రంలో ఎస్ఐ విశ్వనాథ నాయుడు ఆధ్వర్యంలో పోలీసులు శనివారం వాహన తనిఖీలు చేపట్టారు. రికార్డులు సక్రమంగా లేని పలు వాహనాలకు జరిమానా వేశారు. అధిక లోడుతో ప్రయాణిస్తున్న వాహనదారులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. నింబంధనలు పాటించకుంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

సభ్యత్వ నమోదుపై అవగాహన

శ్రీకాళహస్తి, ఆగస్టు 31: బీజేపీ సభ్యత్వ నమోదులో జిల్లా మొదటి స్థానంలో నిలవాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ చంద్రప్ప అన్నారు. పట్టణంలోని శ్రీరామ్‌నగర్ కాలనీలో శనివారం శక్తి కేంద్రప్రముఖ్ కండ్రిగ ఉమ ఆధ్వ ర్యంలో 107, 108, 109, 110 బూత్ అధ్యక్షులు, సభ్యులతో సభ్యత్వ నమోదుపై అవగాహన కార్యక్రమం నిర్వహిం చారు. జిల్లాలో రికార్డు స్థాయిలో సభ్యత్వ నమోదుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు.

పుత్తూరు వార్తలు

పింఛన్ల పంపిణీ



పింఛన్లు అందజేస్తున్న గంజి మాధవయ్య

పుత్తూరు టౌన్, ఆగస్టు 31: పుత్తూరు మున్సిపాలిటీ 20వ వార్డు కల్యాణపురం ఎస్టీ కాలనీలో టీడీపీ పట్టణాధ్యక్షుడు గాలి జీవరత్నం నాయుడు, జిల్లా ఉపాధ్యక్షుడు గంజి మాధవయ్య వెల్ఫేర్ సెక్రటరీతో కలిసి లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. అలాగే తడుకు దళితవాడలో గంజి మాధవయ్య పింఛన్లు పంపిణీ చేశారు. యూనిట్ ఇన్‌చార్జి ఈశ్వర్ యాదవ్, నాయకులు దశరథరామయ్య, తడుకు సర్పంచు బొబ్బిలి యాదవ్, సెక్రటరీ భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

వడమాలపేట: మండలంలో 96.32 శాతం మంది లబ్ధిదారులకు పింఛన్లు అందించారు. మొత్తం 5268 మంది లబ్ధిదారులు ఉండగా 5074 మందికి పింఛన్లు అందజేశారు.

శివారు ప్రాంతాలపై శీతకన్ను



పద్మావతీ నగర్‌లో నివాసాల మధ్య మురుగునీరు - గుంతలమయంగా ఉన్న రోడ్డు

పుత్తూరు టౌన్, ఆగస్టు 31: పుత్తూరు పట్టణం 2005లో మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయింది. దాదాపు 20 ఏండ్లు కావస్తున్నా అభివృద్ధికి మాత్రం అమడదూరంలో ఉంది. ముఖ్యంగా పట్టణశివారు ప్రాంతాల్లో మౌలిక వసతులు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా పద్మావతి నగర్, శివసాయి నగర్, జండామాను వీధి ఎక్స్‌టెన్షన్, రెడ్డిగుంట తదితర ప్రాంతాల్లో డ్రైనేజీలు, రోడ్లు లేకపోవడం, మురుగునీరు నివాసాల మధ్య నిలిచిపోవడం దోమల నిలయంగా మారి రోగాల భాడిన పడుతామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రోడ్లు, డ్రైనేజీ కాలువలు నిర్మించాలని కోరుతున్నారు.

వైభవంగా శ్రీవారి గ్రామోత్సవం

వడమాలపేట, ఆగస్టు 31: అప్పలాయగుంలోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీవారి గ్రామోత్సవం, ఊంజల సేవ వైభవంగా నిర్వహించారు. వేకువ జామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేపట్టారు. సాయంత్రం ఉభయ నాంచారులతో ప్రసన్న వెంకటేశ్వరస్వామిని సర్వాభరణాలు, పూలమాలలతో అలంకరించి వేదమంత్రాలు, భక్తులు గోవిందనామ స్మరణల నడుమ శ్రీవారి ఊంజల సేవ నిర్వహించారు. అనంతరం సర్వాలంకార భూషితుడైన పద్మావతీ అండాల్ సమేత ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారిని మేళతాలలు, మంగళ వాయిద్యాల నడుమ మాడ వీధుల్లో ఊరేగించారు. భక్తులు నారికేళ, కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయానికి చేరుకున్న స్వామివారికి మంగళ హారుతలిచ్చారు. కార్యక్రమంలో ఆలయ అధికారి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.